ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY

అన్నమయ్య

జిల్లా వార్తలు

5

మంగళవారం 3 డిసెంబరు 2024





ప్రజాదర్బార్‌లో మాట్లాడుతున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

బోగస్ ఇళ్లపై కలెక్టర్ కొరడా..?

- ఇంకా మొదలు పెట్టని ఇళ్ల స్థలాలు ...
- పునాదులతోనే ఆపేసిన పట్టాలు రద్దు..
- జిల్లా వ్యాప్తంగా ముమ్మర విచారణ?

వైసీపీ ప్రభుత్వంలో నవరత్నాలలో అర్హులందరికీ ఇళ్లు పథకంలో భాగంగా జిల్లాలో ఇబ్బడిముబ్బడిగా జగనన్న కాలనీలలో ఇళ్లు ఇచ్చారు. అయితే ఇందులో అర్హుల కంటే.. అనర్హులే ఎక్కువగా ఉన్నారనే ఆరోపణలు ఉన్నాయి. అప్పట్లో వైసీపీ నాయకులు కొందరు రెండు మూడేసి ఇళ్లు తమ పేర్లతో పాటు బినామీల పేర్లతో తీసుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో జిల్లాకు మంజూరైన ఇళ్లలో కనీసం సగం కూడా ఇంకా పూర్తి కాలేదు. చాలా మంది తమకు సొంత ఇళ్లు ఉన్నప్పటికీ జగనన్న కాలనీలలో ఇళ్లు తీసుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇంకా కొందరు రెండు మూడు ఇళ్లు తీసుకుని వాటిని దర్జాగా అమ్ముకున్నారనే ఆరోపణలూ ఉన్నాయి. గత ప్రభుత్వంలో ఈ అక్రమాలపై ఎవరూ నోరు మెదపలేదు. దీంతో అక్రమార్కులు చెలరేగిపోయారు.

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో నిర్మించిన జగనన్న కాలనీల్లో అక్రమాలపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో కలెక్టర్ చామకూరి శ్రీధర్ కొన్ని రోజులుగా వరుసగా జిల్లాలో మండలాల పర్యటనకు వెళ్లినపుడు అక్కడి సిబ్బందిని జగనన్న కాలనీల అక్రమాలపై ఆరా తీసినట్లు సమాచారం. ఇప్పటి వరకు ఇంకా ఇళ్ల నిర్మాణం మొదలు పెట్టని, మొదలు పెట్టి పునాదుల దశలోనే నిలిచిపోయినవి.. ఎన్ని? అనే వివరాలు తీస్తున్నట్లు తెలుస్తోంది. ఈ లెక్క బయటకు రాగానే జగనన్న కాలనీల్లో అక్రమాలపై కలెక్టర్ కొరడా ఝుళిపిస్తారనే ప్రచారం ఉంది.

జగన్ అధికారంలోకి రాగానే...

నవరత్నాలు అర్హులందరికీ ఇళ్ల పథకంలో భాగంగా జిల్లాలో 75 వేలకు పైగా ఇళ్లను మంజూరు చేసింది. పట్టణాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో సైతం ఇళ్లను మంజూరు చేశారు. చాలాచోట్ల ప్రభుత్వ భూములు అందుబాటులో లేకపోవడంతో ఎక్కడో ఊరికి దూరంగా కొండలు, గుట్టలు, వాగులు, వంకల్లో స్థలాలు ఎంపిక చేసి లబ్ధిదారులకు ఇచ్చారు. కొన్నిచోట్ల మంచి భూములనే లబ్ధిదారులకు ఇంటి స్థలాలుగా ఇచ్చారు. ఒకటిన్నర సెంటు స్థలంలో ప్రభుత్వమే ఇల్లు నిర్మించి ఇస్తుందని తొలుత జగన్ ప్రకటించారు. అయితే తర్వాత కొన్ని రోజులకే మాట, మడమ తిప్పిన జగనన్న తూచ్.. ప్రభుత్వం ఇళ్లు కట్టివ్వలేదని ప్రకటించారు. లబ్ధిదారులే కట్టుకుంటే ప్రభుత్వం ఇసుక, సిమెంటు, కడ్డీలు ఇస్తుందని ప్రకటించారు. జిల్లాలో 75,637 ఇళ్లను మంజూరు చేశారు. నియోజకవర్గాలవారీగా చూస్తే రాయచోటిలో 19,145 ఇళ్లు, పీలేరులో 11,956, రాజంపేటలో 10,595, రైల్వేకోడూరులో 6378, తంబళ్లపల్లెలో 12,392, మదనపల్లెలో 15,171 ఇళ్లను మంజూరు చేశారు.



రాయచోటిలోని నారాయణరెడ్డికాలనీ జగనన్న లేఅవుట్‌లో పునాదుల్లోనే ఆగిన గృహ నిర్మాణాలు

ఇష్టారాజ్యంగా కేటాయింపులు

జగనన్న కాలనీల్లో ఇళ్ల కేటాయింపులు అర్హత ప్రామాణికంగా కాకుండా వైసీపీ నాయకుల సిఫార్సు మేరకే జరిగాయనే ఆరోపణలు ఉన్నాయి. రాయచోటి మున్సిపాలిటీలోని నారాయణరెడ్డిపల్లె జగనన్న కాలనీలోనూ అనర్హులకు ఎక్కువగా ఇళ్లు మంజూరు చేశారనే ఆరోపణలు ఉన్నాయి. కాలనీలో ముఖ్యమైన స్థలాలను కొందరు వైసీపీ నాయకులు తమ గుప్పిట్లో పెట్టుకుని వాటిని లక్షల రూపాయలకు అమ్ముకున్నారనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. దీంతో చాలా వరకు ఇప్పటికీ ఇళ్లు మొదలు పెట్టలేదు. ఇంకా కొన్ని పునాదుల దశ కూడా పూర్తి కాలేదని గృహనిర్మాణ శాఖాధికారులే పేర్కొంటున్నారు. వైసీపీ నాయకుల అక్రమాలు తెలిసినా అప్పట్లో ఎటువంటి చర్యలు తీసుకోలేదు.

సగం కూడా పూర్తి కాని ఇళ్లు

జిల్లాలోని జగనన్న కాలనీల్లోని ఇళ్లలో ఇప్పటికీ కనీసం సగం కూడా నిర్మాణం పూర్తి కాలేదు. జిల్లాలోని 75,637 ఇళ్లలో ఇంకా 1108 ఇళ్లు కనీసం నిర్మాణమే మొదలు పెట్టలేదు. 9524 ఇళ్లు బీబీఎల్ (పునాది కంటే తక్కువ), 360 ఇళ్లు పీబీ (బేస్‌మట్టం మీద బీమ్ వేయడం), 18,970 బీఎల్ (పునాది పూర్తి కావడం), 1039 ఎల్ఎల్ (గోడలు ద్వారమందిరం వరకు), 5545 ఆర్ఎల్ (గోడలు పూర్తి కావడం), 2438 ఆర్‌సీ (స్లాబ్ పూర్తి కావడం) దశలో ఉన్నాయి. 36,653 ఇళ్లు మాత్రం పూర్తయ్యాయి. దీంతో జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం జోరుగా జరగకపోవడానికి కారణాలను కలెక్టర్ ఆధ్వర్యంలో అన్వేషించినట్లు తెలిసింది. మండలాల పర్యటనకు వెళ్లినపుడు కలెక్టర్ జగనన్న కాలనీల్లో అక్రమాలు, ఇళ్ల నిర్మాణం గురించి స్థానిక అధికారులను ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే పట్టణాలు మినహా గ్రామీణ ప్రాంతాల్లో ఇంకా నిర్మాణం మొదలు కాని ఇళ్లను కూటమి ప్రభుత్వం రద్దు చేసినట్లు తెలిసింది. పట్టణ ప్రాంతాలలో ఇంకా రద్దు చేస్తూ ఉత్తర్వులు రానట్లు సమాచారం. అయితే ఇంకా నిర్మాణం మొదలు కాని ఇళ్లు, పునాదుల్లోనే ఉన్న వాటిని రద్దు చేయడంపైన దృష్టి సారించినట్లు తెలుస్తోంది. కొందరు ఇప్పటికే తమకు సొంత ఇల్లు ఉన్నప్పటికీ జగనన్న కాలనీల్లో ఇంటి స్థలాలు తీసుకుని అమ్ముకున్నట్లు కూడా గుర్తించినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో జగనన్న కాలనీల్లో అక్రమాలపై అధికారులు ఏ మేరకు చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

గత ప్రభుత్వ తప్పిదాల వల్లే రెవెన్యూ సమస్యలు

- గ్రామసభలు ఏర్పాటు చేసి పరిష్కరించండి
- ప్రజాదర్బార్‌లో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

లక్కిరెడ్డిపల్లె, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో రెవెన్యూ అధికారులు చేసిన తప్పిదం వల్లే ఎక్కడ చూసినా భూసమస్యలు ఉన్నాయని, ఈ సమస్యలున్న గ్రామాల్లో గ్రామసభలు ఏర్పాటు చేసి త్వరితగతనే పరిష్కరించాలని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. సోమవారం లక్కిరెడ్డిపల్లె మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి మంత్రి హాజరై వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భూసమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టి వాటిని పరిష్కరించాలని మంత్రులు, ఎమ్మెల్యేలను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారని, ఆ మేరకు మండల స్థాయి నుంచి నియోజకవర్గాల స్థాయిలో భూసమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. రామాపురం, గాలివీడు, లక్కిరెడ్డిపల్లె మండలాలకు సంబంధించిన 2 వేల మంది అర్జీదారులు పాల్గొని తమ సమస్యలను మంత్రి దృష్టికి తెచ్చారు. కొన్ని సమస్యలపై మంత్రి అధికారులకు ఫోన్ చేసి అక్కడికక్కడే పరిష్కరించారు. మండలంలో ఎక్కువగా కుర్నూతల, దప్పేపల్లె, దిన్నెపాడు, లక్కిరెడ్డిపల్లెల్లో ఫ్రీహోల్డ్, డీకేటీ పట్టాలు, ఆన్‌లైన్ సమస్యలు ఉన్నాయని తెలిపారు. ఈ ఐదు నెలల్లో పూర్తి స్థాయిలో భూసమస్యలు పరిష్కారం కాలేదని మదనపల్లెలో జరిగిన ఘటన ఎక్కడా జరగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రెడ్డెయ్య, తహసీల్దార్ శ్రీనివాసులు, హౌసింగ్ అధికారి శివయ్య, ఎంఈఓ చక్రేనాయక్, ఏఐసీసీ మాజీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు యనమల మదన్‌మోహన్, నవీన్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ షఫినాయక్, ఆరిఫ్, ముక్తార్ అహ్మద్, మండల యూత్ ప్రెసిడెంట్ పక్కీరయ్య, టీడీపీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి శంకరాపు జయరాం, పాపయ్య, సిద్ధక వెంకటరామిరెడ్డి, వెంకటరామరాజు, మూగి వెంకటరమణ, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం చేయొద్దు

- ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు



బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ

రాయచోటిటౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం పనికిరాదని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు తెలిపారు. సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను స్వీకరించి వారితో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ప్రధానంగా కుటుంబ కలహాలు, సైబర్ మోసాలు, తల్లిదండ్రులకు వేధింపులు, భర్త, అత్తారింటి వేధింపులు, భూ, ఆస్తి వివాదాలు, నకిలీపత్రాలు, అధిక వడ్డీలు, ఆన్‌లైన్ మోసం, ఇతర సమస్యలపై ఫిర్యాదుదారులు స్వేచ్ఛగా విన్నవించుకోగా వారి సమస్యలపై ఎస్పీ సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి బాధితులకు చట్ట పరిధిలో న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వారు తీసుకున్న చర్యలకు సంబంధించిన నివేదికను జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి పంపాలని చెప్పారు. ఈ సందర్భంగా ట్రైనీ ఐపీఎస్ అధికారి బుడ్డా మహేష్ ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో పాల్గొన్నారు.

పొదుపు సద్వినియోగంలో జిల్లాకు రెండో స్థానం

- డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ



తంబళ్లపల్లె, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మహిళా సంఘాల్లోని సభ్యులు సేకరించుకున్న పొదుపు మొత్తాలను రుణాల రూపంలో సద్వినియోగం చేసుకోవడంలో అన్నమయ్య జిల్లాకు రెండో స్థానం దక్కినట్లు డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ తెలిపారు. సోమవారం ఆయన స్థానిక వెలుగు కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి సంఘాల పనితీరు, రుణాల పంపిణీ, చెల్లింపులపై ఆరా తీశారు. ప్రతి మహిళా లక్షాధికారి కావాలనే లక్ష్యంతో ప్రభుత్వం మహిళా సంఘాలకు విరివిగా వడ్డీ లేని రుణాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ రుణాలను బ్యాంకు లింకేజి, స్త్రీ నిధి, ఎస్సీ, ఎస్టీలకు ఉన్నతి రుణాల రూపంలో పంపిణీతో పాటు సంఘాల్లోని పొదుపును పూర్తి స్థాయిలో వాడుకోవడానికి సహకరించినట్లు తెలిపారు. గతంలో స్త్రీ నిధి నిధుల దుర్వినియోగంపై విచారించి సంబంధిత సీసీ ద్వారా బకాయిలు రాబడతామని, ఇందుకు సహకరించని వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. స్థానికంగా అందుబాటులో లేని పింఛను లబ్ధిదారులు ఇకపై మూడు నెలలకు ఒకసారి పింఛను తీసుకోవచ్చునన్నారు. గత నెలలో పింఛను పొందని 700 మందికి రెండు నెలల పింఛను డబ్బు పంపిణీ చేసినట్లు తెలిపారు.

ఉద్యోగులందరూ ఒకే గదిలోనే..

- రికార్డులు పెట్టుకోవడానికీ గదులు లేవు
- పోస్టర్లు, కరపత్రాలన్నీ వరండాలోనే
- ఇదీ డీఎంహెచ్‌వో కార్యాలయం దుస్థితి

6

వరి కోతలను వాయిదా వేయాలి

- వరి చేలల్లో నిలిచిన నీటిని తొలగించాలి
- వరి పొలాలను పరిశీలించిన వ్యవసాయాధికారి

రాయచోటిటౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాన్ కారణంగా వరి కోతలను వాయిదా వేయాలని జిల్లా వ్యవసాయశాఖాధికారి చంద్రానాయక్ రైతులకు సూచించారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు దెబ్బతిన్న వరి పంటను సోమవారం ఆయన పరిశీలించారు. రాయచోటి మండల పరిధిలోని వరిగ శెట్టివాండ్లపల్లె సమీపంలో నేలకొరిగిన వరి పంటను పరిశీలించి రైతులతో మాట్లాడి పంట నష్టంపై ఆరా తీశారు. దెబ్బతిన్న వరిధాన్యం నాణ్యత కోల్పోకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. అలాగే మిగిలిన రైతులు కూడా జాగ్రత్తలు పాటించాలని, నీట మునిగిన వరి చేలల్లో నీటిని తొలగించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీలత, వ్యవసాయ అధికారులు దివాకర్, వెంకటమోహన్, రైతు సేవా కేంద్రం అగ్రికల్చరల్ అసిస్టెంట్ అంజలి తదితర రైతులు పాల్గొన్నారు.



వరి పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయశాఖాధికారి చంద్రానాయక్



వర్షం.. రైతుకు కష్టం..

- ఉద్యాన పంటలపై తుఫాన్ దెబ్బ
- వరద నీటిలో అరటి, బొప్పాయి, మామిడి తోటలు
- ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోతున్న రైతులు

6

స్కాట్‌తో విద్యార్థుల్లో క్రమశిక్షణ : డీఈవో

6

ఆర్టీపీపీలో ముగ్గురు అధికారుల బదిలీ

- వీరిపై అవినీతి ఆరోపణలు
- కొరడా ఝుళిపించిన ఏపీ జెన్కో

ఎర్రగుంట్ల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆర్టీపీపీలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొం టున్న ముగ్గురు అధికారులపై ఏపీ జెన్కో యాజమాన్యం కొరడా ఝుళిపించింది. కొద్ది కాలంగా ఆర్టీపీపీలో ఫ్లైయాష్ రవాణాలో అనేక అవకతవకలు జరిగాయన్న ఆరోపణలు వచ్చాయి. వీటిపై జెన్కో విజిలెన్స్ ఎంక్వైరీ చేసి రిపోర్టు ఇచ్చినట్లు సమాచారం. బదిలీవేటు పడిన వారిలో ఆర్టీపీపీ స్టేజ్-1 ఓ అండ్ ఎం డీఈఈగా పనిచేస్తున్న నాపా శ్రీనివాసులును లోయర్ సీలేరు హైడల్ ప్రాజెక్టుకు బదిలీ చేశారు. డీఈ టెక్నికల్‌గా ఫ్లైయాష్ విభాగంలో పనిచేస్తున్న బి.నందానాయక్‌ను శ్రీశైలం రైట్ బ్యాంక్ హైడల్ ప్రాజెక్టుకు బదిలీ చేశారు. కోల్ ప్లాంటులో డీఈఈగా పనిచేస్తున్న బి.చంద్ర ఓబుళరెడ్డిని మాచ్‌ఖండ్ హైడల్ ప్రాజెక్టుకు బదిలీచేస్తూ జెన్కో ఎండీ చక్రధర్ బాబు ఉత్తర్వులు ఇచ్చారు. వారిని వెంటనే రిలీవ్ చేయమని పేర్కొనడంతో ఆర్టీపీపీ చీఫ్ ఇంజినీర్ గౌరీపతి వారిని రిలీవ్ చేశారు.

ఇక్కడ వారిపై వచ్చిన అనేక అవినీతి ఆరోపణలపై తదుపరి విచారణ కొనసాగిస్తున్నట్లు సమాచారం. కాగా.. ఆ ముగ్గురు అధికారులను బదిలీ చేయడంతో ఆర్టీపీపీలో ఉన్న మరి కొన్ని అవినీతి తిమింగలాల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. విచారణ జరిపితే ఆర్టీపీపీలో ఫెవికాల్ వీరులుగా ఉన్న వీరి బాగోతాలు కూడా వెలుగులోకి వచ్చే అవకాశాలున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు.

వీడని వర్షం

- భయాందోళనలో ప్రజలు
- లోతట్టు ప్రాంతాలను అప్రమత్తం చేసిన అధికారులు
- ఉధృతంగా ప్రవహిస్తున్న గుంజన నది

రైల్వేకోడూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నాలుగు రోజులుగా రైల్వేకోడూరులో వర్షం కురుస్తూనే ఉంది. సోమవారం కూడా భారీ వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. గుంజన, కల్లెరు, గుండాలేరు, మేకలగుంతేరు తదితర నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలను రెవెన్యూ, పోలీసు శాఖాధికారులు అప్రమత్తం చేశారు. రెడ్డివారిపల్లె, కొండారెడ్డిపోడు గ్రామాల వద్ద రోడ్లు తెగిపోవడంతో అటువైపు వెళ్లవద్దని పోలీసులు ప్రజలకు హెచ్చరికలు జారీ చేశారు. నదుల వద్ద పోలీసులు గస్తీగా ఉన్నారు. చెరువులు పొంగి అలుగులు పారుతున్నాయి. ముష్టేరు నదికి కూడా నీరు వస్తోంది. భారీ వర్షాలు కురిస్తేనే ఈ నదికి నీరు వస్తుంది. ఈ నదికి నీరు వస్తే మూడేళ్లు కరువు ఉండదని స్థానికులు అంటున్నారు. రెడ్డివారిపల్లె తదితర గ్రామాల్లో వరద నీరు ఇళ్లలోకి రావడంతో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు.



ఉధృతంగా ప్రవహిస్తున్న గుంజన నది

జ్యోతికాలనీని వరద నీరు చుట్టుముట్టింది. దీంతో ఇక్కడి ప్రజలు భయాందోళనతో ఉన్నారు. మండలంలోని ఉర్లగట్టుపోడు గ్రామానికి చెందిన సురేష్‌కుమార్, పద్మావతి, గురుమూర్తి అనే రైతులకు చెందిన మూడెకరాల అరటి తోట వర్షాలకు నానిపోయి కూలిపోయింది. సుమారు రూ.5 లక్షలు నష్టం వాటిల్లిందని వారు వాపోయారు. కూలిపోయిన అరటి తోటలను ఉద్యాన శాఖ అధికారులు పరిశీలించారు. నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు పంపుతామని ఉద్యాన శాఖ అధికారి భాస్కర్ తెలిపారు.



రైల్వేకోడూరు మండలం ఉర్లగట్టుపోడు వద్ద నేలవాలిన అరటి తోట



జ్యోతి కాలనీలో ప్రవహిస్తున్న వర్షం నీరు

వర్షం.. రైతుకు కష్టం...

- ఉద్యాన పంటలపై తుఫాన్ దెబ్బ
- వరద నీటిలో అరటి, బొప్పాయి, మామిడి తోటలు
- ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోతున్న రైతులు


నీటిలో మునిగిన చీనీ, నిమ్మ అంటుమొక్కలు

రైల్వేకోడూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఏటా ప్రకృతి వైపరీత్యాలతో రైతులు పంటలను నష్టపోతూనే ఉన్నారు. ప్రస్తుతం తుఫాన్ ఉద్యాన పంటలపై పంజా విసిరింది. దీంతో ఇటు మామిడి, బొప్పాయి పంటలకు తీవ్ర నష్టం ఏర్పడింది. ఒకవైపు అరటి కాయలకు ధరలు లేక తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. మామిడికి డిసెంబరు మాసం నుంచే పూతలు ప్రారంభం కావాల్సి ఉండగా ఇంతవరకు రాలేదు. భూమిలో తేమ శాతం అధికం కావడంతో ఆలస్యంగా పూతలు వస్తాయని ఉద్యానశాఖ, శాస్త్రవేత్తలు చెబుతున్నారు. రైల్వేకోడూరు నియోజకవర్గం ఉద్యాన పంటలకు కేంద్ర బిందువు. ఇక్కడ ఎక్కువగా అరటి, బొప్పాయి, మామిడి పంటలను రైతులు పండిస్తారు. మామిడి 20 వేల హెక్టార్లు, అరటి 15 వేల హెక్టార్లు, బొప్పాయి 15 వేల హెక్టార్లలో సాగు చేస్తున్నారు. ఇక్కడ పండే ఉద్యాన పంటలను ఢిల్లీ, మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటక, ఉత్తర ప్రదేశ్, మధ్యప్రదేశ్, కేరళ, పంజాబ్, హిమాచల్‌ప్రదేశ్ తదితర నగరాలకు ఎగుమతి చేస్తున్నారు. ప్రతి ఏటా కోట్లాది రూపాయల వ్యాపారం జరుగుతుంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా అరటి, మామిడి, బొప్పాయి తోటల వైపు రైతులు వెళ్లడం లేదు. మామిడికి వర్షాలు రాకమునుపు వేలాది రూపాయలు ఖర్చు చేసి మందులు పిచికారీ చేశారు.

కొట్టిన మందులు నీటి పాలయ్యాయని రైతులు వాపోతున్నారు. ముందస్తుగా వచ్చిన రుమాణి మామిడి కాయలకు మంగు ఏర్పడింది. కొనేవారు లేక రైతులు కిలో రూ.4 నుంచి రూ.5కు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. టిష్యూకల్చర్ అరటి, బొప్పాయి నర్సరీల్లో వర్షపు నీరు చేరడంతో వ్యాపారులు తీవ్రంగా నష్టపోతున్నారు. వరి నాట్లు వేసుకోవడానికి చెరువుల కింద నార్లు పోశారు. వర్షం తగ్గకపోవడంతో రైతులు ఏమీ చేయలేని పరిస్థితి ఏర్పడింది.

నాటిన బొప్పాయి మొక్కలు చనిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. గుండాలపల్లె, బయనపల్లె, తిమ్మిశెట్టిపల్లె, ఓబనపల్లె, అనంతరాజుపేట తదితర గ్రామాల్లో అంటుమొక్కలకు అసలే ధరలు లేవు. అవి కూడా దెబ్బతింటున్నాయని రైతులు, వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైతుల అవసరాలకు సాగు చేస్తున్న పూల తోటలు, కూరగాయల తోటలు దెబ్బతింటున్నాయి.

ప్రతి ఏటా కురుస్తున్న భారీ వర్షాలు, పెనుగాలుల వల్ల ఉద్యాన పంటల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. అరటి తోటలు వర్షం దెబ్బకు నానిపోయి కూలిపోతున్నాయి. ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటున్నారు.


బొప్పాయి తోటలో చేరిన వర్షం నీరు

మామిడి రైతులను ఆదుకోవాలి



మామిడి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి. ముందుగా వచ్చిన పూతలు మాడిపోయినాయి. డిసెంబరు మాసం నుంచి పూతలు రావాల్సి ఉంది. వర్షంతో పూతలు ఆలస్యంగా వచ్చే అవకాశాలు ఉన్నాయి. భూమిలో తేమ శాతం అత్యధికంగా ఉండడంతో మామిడిని దెబ్బతీస్తుంది. మామిడికి ఎక్కువ వేడి ఉండాలి. ప్రభుత్వమే మామిడి రైతులను ఆదుకోవాలి.

- మంకు సుబ్రహ్మణ్యం, రైతు, శెట్టిగుంట

వర్షాలతో రైతులు గుల్ల



రైతు, శెట్టిగుంట ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో రైతులు గుల్లయ్యారు. చేతికి అందాల్సిన పంటలు రాలేదు. పెట్టిన పెట్టుబడులు కూడా అందడం లేదు. నష్టాలు వస్తున్నాయే తప్ప లాభాలు, పెట్టుబడి రావడం లేదు. అధికారులు పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక పంపాలి.

- పి.దుర్గయ్య, రైతు, శెట్టిగుంట

ఉచితంగా విత్తనాలు ఇవ్వాలి



రైతులకు బొప్పాయి విత్తనాలతో పాటు మామిడి మొక్కలు, అరటి మొక్కలు ఇవ్వాలి. ప్రభుత్వమే నేరుగా సరఫరా చేయాలి. రైతుల ఇబ్బందులను పరిశీలించి తగిన న్యాయం చేయాలి. రైతు బాగుంటే దేశం బాగుంటుంది.

- చంద్ర, న్యాయవాది, శెట్టిగుంట

ఉద్యోగులందరూ ఒకే గదిలోనే...

- రికార్డులు పెట్టుకోవడానికీ గదులు లేవు
- పోస్టర్లు, కరపత్రాలన్నీ వరండాలోనే
- ఇదీ డీఎంహెచ్‌వో కార్యాలయం దుస్థితి


డీఎంహెచ్‌వో కార్యాలయ వరండాలోనే ఉంచిన పోస్టర్లు, బ్యానర్లు, కరపత్రాలు

రాయచోటి (కలెక్టరేట్), డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాల ఏర్పాటులో గత ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల కొన్ని శాఖలకు తీరని అన్యాయం జరిగింది. హడావుడిగా జిల్లాలు ఏర్పాటు చేయడంలో వైద్య ఆరోగ్యశాఖకు అన్యాయం జరిగిందని వాదన ఉంది. ఇంత పెద్ద జిల్లాకు డీఎంహెచ్‌వో కార్యాలయాన్ని ప్రైవేటు భవనాల్లో కేటాయిస్తూ అందులోనూ వసతులు లేనటువంటి భవనాలు కేటాయించడంలో గత ప్రభుత్వం నిర్లక్ష్యం చూపిందని ఆ శాఖ సిబ్బంది వాపోతున్నారు.

దాదాపు సంవత్సరం తర్వాత నేషనల్ హైవేకి ఆనుకుని ఉన్న ఎస్టీ బాలుర హాస్టల్‌లో కేటాయిస్తూ అప్పటి కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే దాదాపు పది మంది సెక్షన్లకు సంబంధించిన అధికారులు ఒకే గదిలో కూర్చుని ఉద్యోగం చేస్తున్నటువంటి పరిస్థితి ఇక్కడ ఉంది. ప్రజల ఆరోగ్యాలు కాపాడే ఈ శాఖకు కనీస వసతులు కూడా కల్పించలేదు. ఆరోగ్య పరిస్థితులపై ప్రజలకు అవగాహన కల్పించే పోస్టర్లు, కరపత్రాలు, బ్యానర్లు, ఇతర సామగ్రి అంతా కూడా కార్యాలయం బయట వరండాలోనే పెట్టుకోవాల్సిన పరిస్థితి ఉంది. ఇంత పెద్ద కార్యాలయానికి ప్రహరీ కూడా లేకపోవడం వల్ల రకరకాల విషపురుగులు వస్తున్నాయని సిబ్బంది వాపోతున్నారు. జిల్లాకు కావాల్సిన మెటీరియల్ మొత్తం ఈ కార్యాలయానికి వస్తే అవి ఎక్కడ ఉంచాలో తెలియక సిబ్బంది తలలు పట్టుకుంటున్నారు. ఇక్కడ పనిచేస్తున్న సిబ్బందికి తాగునీరు లేదు, మరుగుదొడ్లు కూడా సరిగ్గా లేవని చెబుతున్నారు. ఈ విషయంపై డీఎంహెచ్‌వో కొండయ్యను వివరణ కోరగా మాకు రూము అయితే సరిపోవడం లేదు. సిబ్బంది కూడా చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

తుఫాన్‌తో పూల రైతులకు తీవ్ర నష్టం


వాల్మీకిపురంలో తోటలోనే వదిలేసిన చామంతి పూలు

వాల్మీకిపురం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రైతులు ఆరుకాలం శ్రమించి సాగు చేసిన పంటలు కోత సమయాన నష్టాలను చవి చూడాల్సి వస్తోంది. నాలుగు రోజులుగా కురుస్తున్న తుఫాన్ కారణంగా పూల రైతులు తీవ్రంగా నష్టపోయారు. వాల్మీకిపురం మండల వ్యాప్తంగా దాదాపు 40 నుంచి 50 ఎకరాలలో రైతులు బంతి, చామంతి పూల తోటలు సాగు చేశారు. అయితే తుఫాన్ ప్రభావంతో నాలుగు రోజుల నుంచి తుంపర్ల వర్షం కురుస్తుండటంతో పాటు ముసురు కమ్మేయడం వలన పూల తోటలు దెబ్బతిన్నాయి. దీంతో బంతి, చామంతి పూలను తోటల్లోనే రైతులు వదిలేశారు. అంతేకాకుండా వర్షంతో తోటల్లోనే పూలు కుళ్లిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. మార్కెట్‌లో బంతి పూలు కిలో రూ.50, చామంతి పూలు కిలో రూ.120 ఉన్నప్పటికీ తుఫాన్ కారణంగా తడిచిపోయిన పూల దిగుబడులను మార్కెట్లకు తరలించడం ద్వారా చామంతి కిలో రూ.40, బంతి పూలు కిలో రూ.15 పలుకుతుండటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

5న కలికిరిలో రీజనల్ పాలిటెక్ ఫెస్ట్

కలికిరి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కలికిరి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం నుంచి రెండు రోజుల పాటు ప్రాంతీయ పాలిటెక్ ఫెస్ట్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాసులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా స్థాయిలో నిర్వహిస్తున్న ఈ పాలిటెక్ ఫెస్ట్‌ను 5వ తేదీ గురువారం ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి ప్రారంభిస్తారని చెప్పారు. జిల్లాలోని మొత్తం 20 పాలిటెక్నిక్ కళాశాలలకు చెందిన 344 మంది పాలిటెక్నిక్ విద్యార్థులు ఈ ప్రాంతీయ పాలిటెక్ ఫెస్ట్‌లో పాల్గొంటారని వివరించారు.

కలికిరి పట్టణంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల్లోని 9, 10 తరగతుల విద్యార్థులు కూడా ఈ ఫెస్ట్‌కు హాజరుకానున్నట్లు చెప్పారు. పాలిటెక్నిక్ విద్యాభ్యాసం ప్రాధాన్యత గురించి అవగాహన పెంచుకోవడానికి ఈ ఫెస్ట్ మంచి వేదికగా ఉంటుందని పేర్కొన్నారు.

మల్టీ గ్రైన్ ఇన్‌స్టెంట్ పౌడర్ల తయారీ

విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై మహిళలకు శిక్షణ


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ మంజుల

కలికిరి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో ఐదు రోజులుగా జరుగుతున్న విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై శిక్షణలో భాగంగా చివరి రోజు సోమవారం చిరుధాన్యాలతో 30 రకాల మల్టీ గ్రైన్ ఇన్‌స్టెంట్ పౌడర్ల తయారీని విజయవంతంగా పూర్తి చేసినట్లు కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ మంజుల తెలిపారు. మల్టీ గ్రైన్ పౌడర్లతో పాటు బొప్పాయి క్యాండీస్ కూడా తయారు చేసినట్లు ఆమె వెల్లడించారు.

ఐదు రోజులుగా విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై గ్రామీణ మహిళలకు జరుగుతున్న శిక్షణలో భాగంగా సోమవారం జరిగిన ముగింపు సమావేశంలో ఆమె మాట్లాడుతూ మొదటిసారిగా వివిధ రకాల చిరుధాన్యాలతో మల్టీ గ్రైన్ ఇన్‌స్టెంట్ పౌడర్లు తయారు చేయడంలో మెలకువలను నేర్పించినట్లు చెప్పారు. ఈ పౌడర్లతో వివిధ రకాల ఆరోగ్యవంతమైన పానీయాలను తయారు చేసుకోవచ్చునని చెప్పారు. విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ శిక్షణలో భాగస్వామ్యంతో పాల్గొన్న కలికిరికి చెందిన మంజుల, అమ్మాజీ మాట్లాడుతూ కొర్ర, రాగి లాంటి చిరుధాన్యాలతో బిస్కెట్లు, మురుకులు తదితర పదార్థాల తయారీతో ఆదాయాన్ని పెంచుకోవాలని తెలిపారు. మల్టీ గ్రైన్ ఇన్‌స్టెంట్ పౌడర్లను జావ రూపంలోనూ, దోసె పిండిలో కలుపుకుని వినియోగించుకోవచ్చని సూచించారు. లడ్డూ, బజ్జీల తయారీలో కూడా ఈ పౌడర్లను కలిపి తయారు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు, శిక్షణ పొందిన మహిళలు, కేవీకే సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


పీలేరులో జరిగిన మెడికల్ క్యాంపులో డీఐవో ఉషశ్రీ

పీలేరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉంటూ అవి ప్రబలకుండా చూసుకోవాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారిణి డాక్టర్ ఉషశ్రీ వైద్య ఆరోగ్య శాఖ సిబ్బందిని హెచ్చరించారు. మండలంలోని తలపుల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సోమవారం పీలేరు పట్టణం సైనిక్‌నగర్‌లో జరిగిన ఉచిత వైద్య శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా కాన్పులకు దగ్గరగా ఉన్న గర్భిణీలు, బాలింతలు, మంచానికి పరిమితమైన వృద్ధులు, నవజాత శిశువులు, చిన్నారులను జాగ్రత్తగా చూసుకోవాలని ప్రజలకు సూచించారు. వెచ్చటి వాతావరణం, పరిసరాల పరిశుభ్రత, సురక్షిత నీరు, నవజాత శిశువులకు తల్లిపాలు, గర్భిణులు తాజా ఆకు కూరలు తీసుకోవాలన్నారు. వర్షాల ఉధృతి తగ్గే వరకు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించే ప్రజలను చైతన్యవంతుల్ని చేయడమే కాకుండా వ్యాధులకు మందులు పంపిణీ చేయాలని సిబ్బందికి తెలియజేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి రమేశ్‌రెడ్డి, హెచ్‌ఈ కొండయ్య, సూపర్‌వైజర్ కుసుమ, ఏఎన్‌ఎంలు భార్గవి, ప్రమీల, సీహెచ్‌వో చంద్రకళ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

స్కౌట్‌తో విద్యార్థుల్లో క్రమశిక్షణ : డీఈవో



శిక్షణలో మాట్లాడుతున్న డీఈవో సుబ్రమణ్యం

రాయచోటిటౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో క్రమశిక్షణ, దేశభక్తి, సామాజిక సేవ పెంపొందడానికి స్కౌట్ శిక్షణ తోడ్పడుతుందని డీఈవో సుబ్రమణ్యం అన్నారు. రాయచోటి పట్టణంలోని అర్చనా కళాశాలలో సోమవారం నుంచి స్కౌట్ మాస్టర్లు, గైడ్ కెప్టెన్లకు ఏడు రోజుల శిక్షణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్ మాస్టర్లు, కెప్టెన్లు అందరూ సేవాభావం, క్రమశిక్షణతో పనిచేయాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్‌ను తప్పనిసరిగా ఏర్పాటు చేసేందుకు సంబంధిత ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకోవాలన్నారు. అకడమిక్ క్యాలెండర్ ప్రకారం వారంలో ఒకరోజు స్కౌట్స్ అండ్ గైడ్స్‌కు ఒక పీరియడ్ కేటాయించామన్నారు. స్కౌటిజంతో చిన్ననాటి నుంచే విద్యార్థుల్లో సేవాభావం అలవడుతుందన్నారు. అనంతరం అర్చన విద్యాసంస్థల కరస్పాండెంట్ మదన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ తల్లిదండ్రులు, గురువులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించడంతో పాటు సమాజంలో బాధ్యతగా వ్యవహరించడానికి ఈ శిక్షణ తోడ్పడుతుందన్నారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యదర్శి మడితాటి నరసింహారెడ్డి, ట్రెజరర్ మార్ల ఓబుల్‌రెడ్డి, అసిస్టెంట్ స్టేట్ ఆర్గనైజింగ్ కమిషనర్ లక్ష్మీకర, జిల్లాలోని స్కౌట్ మాస్టర్లు, గైడ్ కెప్టెన్లు పాల్గొన్నారు.

ఉరి వేసుకుని ఆటో డ్రైవర్ మృతి

తంబళ్లపల్లె, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఉరి వేసుకుని ఆటో డ్రైవర్ మృతి చెందిన సంఘటన సోమవారం మండలంలో జరిగింది. కుటుంబసభ్యులు, పోలీసుల కథనం మేరకు...తంబళ్లపల్లె మండలం రేణుమాకులపల్లె పంచాయతీ మిట్టమాలపల్లెకు చెందిన రమణయ్య (49) ఆటో నడుపుకుంటూ కుటుంబ పోషణ సాగించేవాడు. దురలవాట్లకు బానిసై కుటుంబాన్ని పట్టించుకోలేదు. దీంతో కుటుంబసభ్యులు మందలించడంతో మనస్థాపం చెంది గ్రామానికి సమీపంలోని చెట్టుకు ఉరి వేసుకుని మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న ఎస్‌ఐ లోకేష్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

జెండా దినోత్సవ స్టిక్కర్ల ఆవిష్కరణ


స్టిక్కర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, తదితరులు

రాయచోటి (కలెక్టరేట్), డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సాయుధ దళాల జెండా దినోత్సవం (డిసెంబరు 7) సందర్భంగా ప్రత్యేక స్టిక్కర్లను సోమవారం కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జేసీ ఆదర్శ్ రాజేంద్రన్, కడప జిల్లా సైనిక్ వెల్ఫేర్ అధికారి రజాక్‌ఖాన్, పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సాయుధ దళాల త్యాగాలు, సేవలను గుర్తించేందుకు జెండా దినోత్సవం ఒక ప్రత్యేకమైన అవకాశం అని తెలిపారు. మాజీ సైనికులు, వీరనారులు, వారి కుటుంబాల సంక్షేమానికి మద్దతుగా ప్రజలు స్వచ్ఛందంగా విరాళాలు అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

బినామీ సంఘమిత్రలను తొలగించండి

- డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ

గుర్రంకొండ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గుర్రంకొండ మండలంలో బినామీ సంఘమిత్రలుగా పనిచేసే వారిని విధుల నుంచి తొలగించాలని డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ ఆదేశించారు. స్థానిక కార్యాలయంలో సోమవారం ఆయన వెలుగు సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుర్రంకొండ మండల సమాఖ్య కార్యాలయంలో పనిచేసే సంఘమిత్రల్లో బినామీలున్నట్లు తెలిసిందన్నారు. ఈ బినామీలు అక్రమాలకు పాల్పడుతున్నట్లు జిల్లా అధికారులకు పలు ఫిర్యాదులు వచ్చాయన్నారు. అంతేకాకుండా గ్రూప్ సభ్యుల నుంచి రుణాలకు మామూళ్లు వసూలు చేస్తున్నారని కొందరు నాయకులు తమ దృష్టికి తెచ్చినట్లు తెలిపారు. మండలంలో బినామీ సంఘమిత్రలుగా పనిచేసే వారి వివరాలను తమకు పంపాలన్నారు.

అలాంటి వారిని తక్షణమే తొలగించడానికి తగిన చర్యలు తీసుకోవాలని ఏపీఎం రజనీకుమారిని ఆదేశించారు. అనంతరం మండలంలో గ్రూప్‌ల వివరాలు, సభ్యులకు అందుతున్న రుణాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. సంఘమిత్రలు విధులను దుర్వినియోగం చేస్తే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సీసీలు, సంఘమిత్రలు పాల్గొన్నారు.

వాహనం ఢీకొని కృష్ణజింక మృతి



ములకలచెరువు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ములకలచెరువులో సోమవారం ఓ కృష్ణజింక దారి తప్పి వచ్చి హల్‌చల్ చేసింది. జనావాసంలోకి వచ్చి దిక్కుతోచక హడలెత్తిపోయింది. చివరకు గుర్తుతెలియని వాహనం ఢీకొని మృతి చెందింది. స్థానికుల కథనం మేరకు...ములకలచెరువు బస్టాండు సర్కిల్ సమీపంలో ముంబాయి-చెన్నై జాతీయ రహదారిపైకి ఓ కృష్ణజింక వచ్చింది. రోడ్డు పక్కనున్న రైల్వే క్వార్టర్స్ నుంచి వచ్చిన జింక అడ్డుగా ఉన్న రైల్వే కమ్మీలు దాటుకుని రోడ్డుపైకి వచ్చింది. కొంతసేపు రోడ్డుపై అటు, ఇటు తిరిగింది. జాతీయ రహదారికి ఇరువైపులా ఫుట్‌పాత్‌కు ఆనుకుని ఇటీవల వేసిన ఇనుప కమ్మీలు దాటుకోలేక రోడ్డుకు అడ్డుగా తిరిగింది. చివరకు దానిని గుర్తుతెలియని వాహనం ఢీకొంది. తీవ్రంగా గాయపడిన అది కొద్దిసేపటికి మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ గాయత్రి సంఘటనా స్థలానికి చేరుకుని విషయాన్ని ఫారెస్టు అధికారులకు సమాచారం ఇచ్చారు. ఫారెస్టు అధికారులు మృతి చెందిన జింక కళేబరాన్ని కనుగొండ అటవీప్రాంతంలో ఖననం చేశారు.

గుండాలకోనకు రోడ్డు మంజూరు

- తీరిన భక్తుల కోరిక
- రూ.2 కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం


గుండాలకోనకు వెళ్లే మార్గం

రైల్వేకోడూరు (రూరల్), డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గుండాలకోనకు రోడ్డు నిర్మించాలని ఎన్నో ఏళ్లుగా కోరుకుంటున్న భక్తుల కల నెరవేరింది. చిట్వేలి మండలంలోని పెద్దూరు నుంచి ఎంద్రకాయ గుండాలకోన రోడ్డుకు మోక్షం లభించింది. రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ.2 కోట్లు మంజూరు చేసింది. చాలా ఏళ్లుగా ముళ్లపొదలు, అధ్వాన్నమైన రోడ్డులో కోనకు వెళ్లాలంటే భక్తులు చాలా ఇబ్బందులు పడేవారు. ఇక్కడ మహిమాన్వితమైన ఎంద్రకాయ రూపంలో శివుడు దర్శనమిస్తాడు. కార్తీకమాస ఉత్సవాల్లో ప్రతిరోజూ వేలాది మంది భక్తులు ఇక్కడ పూజలు చేసి అక్కడ ఉన్న జలపాతంలో స్నానం ఆచరిస్తారు. మహాశివరాత్రి రోజు భక్తులు ఇక్కడికి పోటెత్తుతారు. గత ప్రభుత్వంలో రోడ్డును మంజూరు చేసినా నిధులు విడుదల చేయకపోడంతో పాటు అటవీశాఖ అధికారుల అనుమతులు కూడా మంజూరు కాకపోవడంతో రోడ్డు పనులు కార్యరూపం దాల్చలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ రోడ్డుకు నిధులతో పాటు అటవీశాఖ అనుమతులు కూడా ఇచ్చింది. దీంతో గుండాలకోన రోడ్డుకు ఉన్న అడ్డంకులు పూర్తిగా తొలగిపోయి త్వరలో రోడ్డు పనులు ప్రారంభం కానున్నాయి. ఎన్నో ఏళ్లుగా ఆధ్యాత్మికంగా విరాజిల్లుతున్న గుండాలకోనకు రోడ్డు వస్తుండటంతో భక్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

కాసుల పంట.. కురిసెను రైతు ఇంట



- నిలకడగా టమోటా ధరలు
- ఆశించిన రీతిలో దిగుబడులు
- ఆనందోత్సాహాల్లో రైతులు

సంబేపల్లె, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): రాయలసీమ జిల్లాల్లో కరువు నేలపై కాసులు కురిపించే పంట ఏదైనా ఉందంటే అది టమోటా. అన్నమయ్య జిల్లాలో కొన్ని మండలాల్లో రైతులు టమోటా సాగు విపరీతంగా సాగు చేస్తారు. ఇందులో సంబేపల్లె, చిన్నమండెం, కలకడ, గుర్రంకొండ, అంగళ్లు, మదనపల్లె, కేవీపల్లె, మొలకలచెరువు, తంబళ్లపల్లి మండలాల్లో రైతులు విపరీతంగా టమోటా పంటసాగులు చేపడతారు. ఈ ఏడాది టమోటా రైతులకు ధరలు కలిసొచ్చాయి. ఐదారు నెలలుగా ధరలు నిలకడగా ఉండడంతో రైతులకు ఆశించిన రీతిలో కాసులు కురిపించాయి. కరువు నేలపై కాసుల పంట కురిసింది. రైతులు ఆశించిన రీతిలో మంచి దిగుబడులు రావడంతో మంచి ఆదాయాలను ఆర్జించారు.


సాగులో ఉన్న టమోటా తోట

టమోటా సాగులో నూతన ఒరవడి

ఒకప్పుడు టమోటా సాగుకు, ప్రస్తుత టమోటా సాగుకు ఎంతో వ్యత్యాసం ఉంది. పంట సాగుల్లో రైతులు నూతన ఒరవడిని సృష్టిస్తున్నారు. ఇందులో భాగంగా అధిక దిగుబడినిచ్చే తీగజాతి రకాలు మార్కెట్‌లో రావడంతో వాటివైపు మొగ్గు చూపుతున్నారు. సాధారణ టమోటా సాగు (కట్టెలు కట్టకుండా) నాలుగు నుంచి ఆరు టన్నుల దిగుబడి వస్తే, తీగజాతి రకం టమోటా 20 నుంచి 22 టన్నులు దిగుబడి రావడం విశేషం. రైతులు కట్టె పద్ధతిలో పురి కట్టి సాగు చేయడంతో వర్షాలకు టమోటా తోటలు దెబ్బతినకుండా కాయ నాణ్యతగా మంచి దిగుబడి తీస్తున్నారు.

సాగుకు పెరిగిన ఖర్చులు

తీగజాతి రకం టమోటా సాగుకు పెట్టుబడులు పెరిగిపోయాయి. గత నాలుగు సంవత్సరాల క్రితం ఒక ఎకరానికి 80 నుంచి రూ.లక్ష పెట్టుబడి పెట్టేవారు. ప్రస్తుతం 1.50 లక్షల నుంచి 1.70 లక్షల వరకు పెట్టుబడి వస్తోంది. కూలీలు రేటు పెంచారు. టమోటా సామగ్రి ధరలు పెరిగాయి. ఇలా ప్రతి ఒక్కటి పెరగడంతో సాగు ఖర్చులు పెరిగిపోయాయి.

రైతులకు అనువుగా మార్కెట్‌లు

రైతులకు అనుకూలంగా టమోటా మార్కెట్లు ఏర్పాటు చేశారు. జిల్లాలో కలకడ, గుర్రంకొండ, మొలకలచెరువు, మదనపల్లి, అంగళ్లు ప్రాంతంలో టమోటా మార్కెట్లు ఉన్నాయి. దీంతో రైతులు పండించిన టమోటా మార్కెట్‌కు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. చిత్తూరు ఆర్కాడు, చెన్నై, ఆళ్లగడ్డ, హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి వ్యాపారులు తోటల వద్ద టమోటా కొనుగోలు చేస్తున్నారు.

మంచి ఆదాయం వచ్చింది

- నాగిరెడ్డి, రైతు, మాధంవాండ్లపల్లి

ఈ సారి టమోటా సాగులో మంచి ఆదాయం వచ్చింది. ఒకటిన్నర ఎకరం టమోటా సాగు చేశా. పెట్టుబడి సుమారు రూ.3.50 లక్షలు వచ్చింది. ఖర్చులు పోనూ దాదాపు రూ.4 లక్షల వరకు ఆదాయం వచ్చింది. ఈ సారి టమోటా నష్టాల నుంచి గట్టెక్కింది.

ధర ఉంటే.. ఆదాయం లక్షల్లోనే

- వెంకటేశ్వరనాయుడు, దిగువరాజుగారిపల్లె, దేవపట్ల



టమోటా ధరలు ఉంటే ఆదాయం లక్షల్లోనే ఉంటుంది. ఒక ఏడాది ధరలు అమాంతంగా పడిపోవడం, పెట్టుబడులు రాక నష్టపోవడం జరుగుతుంది. ఈ ఏడాది నిలకడగా ధరలు ఉండడంతో మంచి ఆదాయం వచ్చింది. సంబేపల్లె వద్ద గుత్తకు రెండు ఎకరాల పొలం తీసుకొని సాగు చేశా. ఖర్చులు పోనూ 9 లక్షలు ఆదాయం వచ్చింది.

తండ్రి చేతిలో కొడుకు హతం


హుస్సేన్‌బాష (ఫైల్‌ఫోటో)

దువ్వూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండలం కానగూడూరు గ్రామంలో సోమవారం హత్య జరిగింది. కన్న తండ్రే కొడుకును హత్య చేశాడు. మైదుకూరు సీఐ శివశంకర్ వివరాల మేరకు... హుస్సేన్‌బాషా (23) మద్యానికి బానిసై కుటుంబ సభ్యులను దూషించేవాడు. కొద్దిరోజుల కిందట డబ్బులు ఇవ్వలేదని హుస్సేన్‌బాషా తన తండ్రి మహబూబ్ షరీఫ్‌ను చంపుతానని బెదిరించాడు. ప్రతిరోజులాగానే సోమవారం మద్యం సేవించి ఇంటి వద్దకు వచ్చి తండ్రితో గొడవపడ్డాడు. భయానికి గురైన మహబూబ్‌షరీఫ్ రోకలిబడెతో కొడుకు తలపై బలంగా కొట్టాడు. తీవ్రగాయాలపాలైన క్షతగాత్రుడిని చాగలమర్రి ఆస్పత్రికి తరలించగా అక్కడ మృతిచెందాడని సీఐ తెలిపారు.

న్యాయం చేయండి: తన భర్త మృతికి కారణమైన మహబూబ్‌షరీఫ్‌పై తగిన చర్యలు తీసుకోవాలని మృతుని భార్య పోలీసులను వేడుకున్నారు. తనకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

డీసీసీ బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలి

- రాష్ట్ర అసోసియేషన్ కార్యనిర్వాహక అధ్యక్షుడు



ర్యాలీగా వెళ్తున్న అసోసియేషన్ నాయకులు, ఉద్యోగులు

కడప రూరల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): కడప జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) సేవలను ఖాతాదారులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యనిర్వహక అధ్యక్షుడు గంటా సూర్యనారాయణరెడ్డి పేర్కొన్నారు. డీసీసీబీ సేవలపై సోమవారం అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉద్యోగులు కడప నగరంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు ఎంప్లాయీస్ అసోసియేషన్ పిలుపు మేరకు డిసెంబరు 2 నుంచి 8వ తేది వరకు వారం రోజుల పాటు డీసీసీ బ్యాంకు అందిస్తున్న సేవలను ప్రజలకు వివరించేందుకు పలు కార్యక్రమాలను చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం కడప నగరంలో విస్తృత ప్రచారం సాగించి డిపాజిట్ల సేకరణను తలపెట్టామన్నారు. డీసీసీ బ్యాంకు ఖాతాదారులకు మరింతగా సేవలను అందించేందుకు వడివడిగా ముందుకు సాగుతోందన్నారు. సహకార సంవృద్ధి డిపాజిట్ కాలపరిమితి కింద 666 రోజులకు సీనియర్ సిటిజన్లకు అన్ని బ్యాంకుల కంటే 8.35 శాతం అత్యధిక వడ్డీని, అలాగే సాధారణ ప్రజలకు 7.85 శాతం వడ్డీ ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎన్.సుధీర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి ఎల్.రాజేంద్రప్రసాద్‌రెడ్డి, వీరబ్రహ్మం, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడల్లో గురుకుల విద్యార్థులకు గోల్డ్‌మెడల్


గెలుపొందిన విద్యార్థులతో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

లింగాల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో మండలంలోని ఇప్పట్ల గురుకుల కళాశాల విద్యార్థులు గెలుపొంది గోల్డ్‌మెడల్ సాధించారు. నవంబరు 29, 30, ఈనెల 1వ తేదీలలో పశ్చిమగోదావరి జిల్లా పెదవేగి గురుకుల కళాశాలలో రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో తమ కళాశాల నుంచి చెస్‌కు ఒకరు, క్యారమ్స్‌కు ఇద్దరు, డిస్క్‌త్రోకు ఒకరు, రన్నింగ్‌కు ఒకరు ప్రాతినిధ్యం వహించారని ప్రిన్సిపల్ సత్యవతమ్మ తెలిపారు. సీనియర్ ఎంపీసీ ఎ.నిర్మల డిస్క్‌త్రోలో మొదటిస్థానం, 7వ తరగతి చదువుతున్న వి.భవ్య 200 మీటర్ల విభాగంలో మొదటిస్థానంలో నిలిచారని పేర్కొన్నారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సెక్రటరీ ప్రసన్న వెంకటేష్ విద్యార్థులకు గోల్డ్‌మెడల్ బహూకరించారు. రాష్ట్రస్థాయిలో గెలుపొందిన విద్యార్థులకు సోమవారం ఇప్పట్ల గురుకుల కళాశాలలో ప్రిన్సిపల్ సత్యవతమ్మ, ఉపాధ్యాయులు, సహ విద్యార్థులు అభినందనల వర్షం కురిపించారు. విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచేందుకు ఉపాధ్యాయులు సునీత, మాధవిలు ఎంతో శ్రమించారని ప్రిన్సిపల్ వెల్లడించారు.

విద్యార్థులకు సౌకర్యాల కల్పన

- వైస్‌చాన్సలర్ క్రిష్ణారెడ్డి

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వైవీయూ అనుబంధ వసతిగృహాల విద్యార్థులకు అన్ని సౌకర్యాలు సమకూరేలా నిర్ణయాలు తీసుకున్నారు. వైస్‌చాన్సలర్ క్రిష్ణారెడ్డి, రిజిస్ట్రారు పద్మ, వసతిగృహాల చీఫ్ వార్డెన్, ప్రిన్సిపల్ రఘునాథరెడ్డి వార్డెన్లతో సోమవారం సమీక్ష నిర్వహించారు. విద్యార్థుల అవసరాలు గుర్తించి ప్రిన్సిపల్ రఘునాథరెడ్డి ఈసీ దృష్టికి తెచ్చారు. అనంతరం వైస్‌ఛాన్సలర్ మాట్లాడుతూ విద్యార్థినిలకు ప్రత్యేక మెస్ ఏర్పాటు, సోలార్ విద్యుత్ సౌకర్యం కల్పించాలన్నారు. విద్యార్థులకు వేడి నీరు అందించే ఏర్పాటు చేస్తున్నామన్నారు. అవసరమైనంత సిబ్బందిని ఏర్పాటు చేసి బాధ్యతలు ఇవ్వనున్నట్లు స్పష్టం చేశారు. అలాగే క్యాంపస్‌లో సీసీ కెమెరాలు పనిచేయని చోట వెంటనే ఏర్పాటు చేయాలని, ఇన్వర్టర్లు అవసరం ఉంటే ఏర్పాటు చేయాలన్నారు.

అంతర్ విశ్వవిద్యాలయాల పోటీల్లో కాంస్యపతకం

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): అంతర్ విశ్వవిద్యాలయాల పోటీల్లో వైవీయూ విద్యార్థి దేవరకొండ ప్రేమ్‌సాగర్‌కు కాంస్యపతకం దక్కింది. 51 కిలోల విభాగంలో ఈ పతకం సాధించాడు. ఈ విద్యార్థి కమలాపురం సీఎస్ఎస్ఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్నాడు. దక్షిణభారత అంతర్ విశ్వవిద్యాలయ పోటీల్లో పాల్గొని పతకం సాధించడం పట్ల వైస్‌ఛాన్సలర్ క్రిష్ణారెడ్డి, రిజిస్ట్రారు పద్మ, ప్రిన్సిపల్ రఘునాథరెడ్డి, క్రీడల శాఖ విభాగం రామసుబ్బారెడ్డి అభినందనలు తెలిపారు.

నేషనల్ ఆర్ట్ గ్యాలరీకి ఏఎఫ్ఏయూ విద్యార్థి చిత్రం



కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ యూనివర్శిటీ పెయింటింగ్ విభాగం విద్యార్థి ఎస్.కార్తీక్‌కు అరుదైన అవకాశం దక్కింది. జాతీయ స్థాయిలో ప్రఖ్యాత జహంగీర్ ఆర్ట్ గ్యాలరీలో నిర్వహించే ఎగ్జిబిషన్‌లో ప్రదర్శనకు ఉంచే టాప్ 45 చిత్రాల్లో కార్తీక్ గీసిన చిత్రానికి అవకాశం లభించింది. నవంబరు 24 నుంచి 30 వరకు క్యామల్ ఆర్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హంపీలో నిర్వహించిన వర్క్‌షాపులో ఉత్తమమైన కళాఖండాలను ఎంపిక చేయగా అందులో కార్తీక్ గీసిన చిత్రం ఉంది. దీనిని ఈ నెల 14 నుంచి 20 వరకు ముంబైలో జహంగీర్ ఆర్ట్ గ్యాలరీ ఎగ్జిబిషన్‌లో ఉంచనున్నారు. తమ విద్యార్థి చిత్రం నేషనల్ ఆర్ట్ గ్యాలరీలో ప్రదర్శనకు ఎంపిక కావడంతో వీసీ విశ్వనాథకుమార్ అభినందనలు తెలిపారు.

అక్రమాలపై మొదలైన విచారణ

- పలు సెక్షన్లలో ఫైళ్లు పరిశీలిస్తున్న అధికారులు


మున్సిపల్ ఆర్‌డీ విశ్వనాథ్

ప్రొద్దుటూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో గత ఐదేళ్ల వైసీపీ పాలనలో సాగిన అక్రమాలపై మున్సిపల్ రీజనల్ డైరెక్టర్ విశ్వనాథం సారథ్యంలో విచారణ మొదలైంది. సోమవారం ఉదయం ప్రొద్దుటూరుకు వచ్చిన ఆర్‌డీ మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ మల్లికార్జునతో కలిసి సమావేశమయ్యారు. అనంతరం విచారణ బృందంలోని ఎస్ఈ రామ్మోహన్‌రెడ్డి, ఈఈ షాకీర్, డీఈ సత్యనారాయణ, ఏఈ శరత్‌చంద్రలకు ఇంజనీరింగ్ సెక్షన్‌లోని ఫైళ్లు పరిశీలించమని ఆదేశించారు. దీంతో వారు ఇంజనీరింగ్ సెక్షన్ అధికారులైన ఈఈ చెన్నకేశవరెడ్డి, డీఈలు దస్తగిరి, ప్రభాకర్‌దాస్, యశోద, ఏఈలు మణిగోపాల్‌రెడ్డి, సురేంద్ర, దిల్షాద్‌లతో కలిసి ఇంజనీరింగ్ సెక్షన్‌లో గత ఐదేళ్ల కాలంలో జరిగిన వర్కులకు సంబంధించిన ఫైళ్లను సంవత్సరాల వారిగా విభజించారు. అలాగే గ్రాంట్ వర్కులు, జనరల్‌ఫండ్ వర్కులు, ఇతర వర్కులను పరిశీలించారు. అలాగే బర్త్ అండ్ డెత్ విభాగంలోనూ పరిశీలించారు. టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించి బుధవారం టౌన్‌ప్లానింగ్ ఆర్‌డీ రానున్నారని, ఆయన వచ్చాక బిల్డింగ్ అనుమతుల ఫైళ్లు, ఇతర ఫైళ్లు పరిశీలించనున్నట్లు ఆర్‌డీ తెలిపారు. ప్రస్తుతం టౌన్ ప్లానింగ్ సెక్షన్‌కు సంబంధించి అన్ని ఫైళ్లు అందుబాటులో వుంచుకోవాలని ఆ సెక్షన్ అధికారులను, సిబ్బందిని ఆదేశించినట్లు తెలిపారు.

కీలక ఫైళ్ల మాయంపై విచారణ

టౌన్‌ప్లానింగ్ సెక్షన్‌లో కీలక ఫైళ్ల మాయంపై గతంలో ఇక్కడ పనిచేసి కడప కార్పొరేషన్‌కు బదిలీపై వెళ్లిన ఏసీపీ మునిరత్నం సోమవారం మున్సిపల్ కార్యాలయానికి వచ్చారు. మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున ఎదుట హాజరై ఫైళ్లకు సంబంధించిన సమాచారంపై వివరణ ఇచ్చారు. అయితే ఆ ఫైళ్లకు సంబంధించిన పూర్తి స్థాయి సమాచారం అందించలేదని చెబుతున్నారు. అలాగే టౌన్‌ప్లానింగ్ సెక్షన్‌లో పాత ఫైళ్లకు సంబంధించి ఆన్‌లైన్ చేసిన హార్డ్‌డిస్క్ గురించి కూడా ఏసీపీ మునిరత్నం సరైన సమాధానం చెప్పనట్లు సమాచారం. దీనిపై కమిషనర్ మల్లికార్జునను వివరణ కోరగా ఆయన ఫోన్‌లో అందుబాటులోకి రాలేదు.

ఆటోను ఢీకొన్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు

- ఇద్దరు మృతి
- నలుగురికి గాయాలు


మృతి చెందిన సుబ్బయ్య, రోశయ్య

పోరుమామిళ్ల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాల్వకట్ట వద్ద ఆటోను ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఢీకొనడంతో ఇద్దరు మృతిచెందగా, మరో నలుగురికి గాయాలయ్యాయి. వివరాలిలా.. ఆర్వీ ట్రావెల్స్‌కు చెందిన బస్సు హైదరాబాదు నుంచి పోరుమామిళ్లకు వస్తుండగా, బెస్తవారిపేట నుంచి బద్వేలుకు ప్యాసింజరు ఆటో వస్తోంది. కాల్వకట్ట వద్దకు రాగానే బస్సు ఆటోను ఢీకొనడంతో రామేశ్వరం గ్రామానికి చెందిన బి.రోశయ్య (65), అక్కుల్‌రెడ్డిపల్లెకు చెందిన ఎం.సుబ్బయ్య (60) అనే వారు అక్కడికక్కడే మృతి చెందారు. బెస్తవారిపేటకు చెందిన కంచి వెంకటకుమార్, అలినగరం గ్రామానికి చెందిన కొమరం చెన్నమ్మ, గిద్దలూరుకు చెందిన బాలుడు అలియాస్ బాలచంద్రుడు, కొమరోలు మండలం పామూరుకు చెందిన షేక్ నాగుర్‌వల్లికి తీవ్రగాయాలయ్యాయి. ప్రమాదకర సంఘటన తెలిసిన వెంటనే సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ కొండారెడ్డి సంఘటనా స్థలానికి వెళ్లి ప్రమాదానికి గల విషయాలు ఆరా తీశారు. గాయపడ్డ వారిని 108 వాహనం ద్వారా పోరుమామిళ్లకు తరలించారు. గాయపడ్డ వారిలో చెన్నమ్మ, మరో వ్యక్తిని ప్రొద్దుటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు ప్రైవేటు బస్సు డ్రైవరుపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

- మరికొందరికి గాయాలు


మృతిచెందిన మహిళ

జమ్మలమడుగు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మండలంలోని ప్రొద్దుటూరు రోడ్డులో అలీపాలకోవా సెంటర్ సమీపాన సోమవారం సాయంత్రం ఆటో డివైడర్‌కు తగిలి ఆటో వెనుక కూర్చొని ఉన్న డక్కా వెంకటభార్గవి (30) అనే మహిళ ఘటనా స్థలంలోనే దుర్మరణం చెందింది. పోలీసుల వివరాల మేరకు.. జమ్మలమడుగు పట్టణంలోని బీసీ కాలనీకి చెందిన మూడు కుటుంబాల వారు మొత్తం 15 మంది దాకా ఆటోలో గండి క్షేత్రానికి సాయంత్రం బయల్దేరారు. ప్యాసింజర్ ఆప్పే ఆటోలో జమ్మలమడుగు నుంచి ప్రొద్దుటూరు రోడ్డుకు వెళుతుండగా పక్కనే వెళుతున్న లారీని ఓవర్‌టేక్ చేయబోయి ఆటో డ్రైవర్ వెంకటయ్య డివైడర్‌కు ఢీకొన్నాడు. దీంతో వెనుక కూర్చొని ఉన్న మహిళ మృతి చెందగా అందులో ప్రయాణం చేస్తున్న పిల్లలు, పెద్దలు కలిపి 14 మందికి స్వల్పగాయాలయ్యాయి. వెంకట్ అనే బాలుడికి మోకాలుకు గాయమైంది. ఘటన జరిగిన వెంటనే ఎస్ఐ కల్పన, రైటర్ సుబ్బారెడ్డి, వారి సిబ్బంది ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతిచెందిన మహిళను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వాహనం ఢీకొని ఒకరు..


బాలక్రిష్ణ (ఫైల్‌ఫోటో)

దువ్వూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మైదుకూరు మండలం మిట్టమాను సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. ఎదురుగా వస్తున్న వాహనం ఢీకొని బాలకృష్ణ (25) అనే యువకుడు మృతిచెందాడు. మృతుడు తన స్నేహితుడితో కలిసి బ్రహ్మంగారిమఠం నుంచి మైదుకూరుకు బైకులో వస్తుండగా మార్గమధ్యంలో ఈ సంఘటన జరిగింది. కాగా ఈ ప్రమాదంలో మృతుడి స్నేహితుడు శ్రీను గాయపడ్డాడు.

జేసీ వర్గీయులు వస్తారేమోనని.. మళ్లీ పోలీసుల మోహరింపు

కొండాపురం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి మధ్య ఆర్టీపీపీకి చెందిన ఫ్లైయాష్ రవాణాలో వివాదం ఇంకా సద్దుమణకపోవడంతో మళ్లీ పోలీసులు అలర్ట్ అయ్యారు. ఆర్టీపీపీ వద్ద జేసీ వర్గీయులకు సంబంధించిన వాహనాలకు ఎమ్మెల్యే ఆది వర్గీయులు బూడిదను లోడ్ చేయనివ్వకపోవడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. తాడిపత్రి నుంచి జేసీ ప్రభాకర్‌రెడ్డి కానీ, అతని అనుచరులు కానీ ఇటువైపు వస్తారేమోనని, సోమవారం ఉదయం 6 నుంచే జిల్లా సరిహద్దుల్లో ఉన్న సుగుమంచిపల్లె చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు మోహరించారు. ఇద్దరు సీఐలు, ఎస్ఐలు, సుమారు 30 మంది పోలీసులు మోహరించారు. శాంతిభద్రతలకు విఘాతం తలెత్తే అవకాశం ఉండటంతో అనుమానం వచ్చిన వాహనాలను తనిఖీలు నిర్వహించారు. జమ్మలమడుగు డీఎస్పీ వెంకటేశ్వరరావు చెక్‌పోస్ట్ వద్దకు వచ్చి పరిస్థితిని సమీక్షించారు. సిబ్బందికి తగు జాగ్రత్తలు, సూచనలు చేశారు. కాగా ఈ ప్రాంతంలో 144 సెక్షన్‌ను విధించినట్లు కొండాపురం సీఐ మహమ్మద్ రఫీ తెలిపారు.

'మత్తు పదార్థాలకు బానిసవ్వద్దు'


సీకేదిన్నె, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): యువత మత్తుపదార్థాలకు బానిస కాకూడదని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, జయరాజ్‌లు తెలిపారు. స్థానిక కేఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాలలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం విద్యార్థినీ, విద్యార్థులకు మాదక ద్రవ్యాలు, వాటి వినియోగం వలన కలిగే అనర్థాలు గురించి సోమవారం అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాదకద్రవ్యాలకు అలవాటు పడితే జీవితాలు నాశనమవుతాయని, తల్లిదండ్రుల ఆశయాలు నెరవేర్చకపోగా మంచి జీవితాన్ని కోల్పోతారన్నారు. మానసికంగా, శారీరకంగా అనేక రుగ్మతలకు గురవుతారని వివరించారు. ఇంజనీరింగ్ విద్య ఎంతో ఉన్నతమైన లక్ష్యంతో పూర్తి చేసి జీవితంలో స్థిరపడాలని, చెడు వ్యసనాలకు బానిస కాకుండా చెడు స్నేహాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు రవికుమార్, క్రిష్ణకుమార్, కళాశాల ఎండీ కందుల చంద్రఓబుళరెడ్డి, ప్రిన్సిపల్ వీఎస్ఎస్ మూర్తి, వైస్‌ప్రిన్సిపల్ ప్రసాద్ విద్యార్థులు పాల్గొన్నారు.

5న టేబుల్ టెన్నిస్ పోటీలు

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వైవీయూ అంతర్ కళాశాలల టేబుల్ టెన్నిస్ పోటీలు ఈ నెల 5న నిర్వహించనున్నట్లు వైవీయూ క్రీడా బోర్డు కార్యదర్శి కె.రామసుబ్బారెడ్డి ప్రకటనలో తెలిపారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు 2024 జూలై 7 నాటికి 17 సంవత్సరాలు నిండి 25 సంవత్సరాల్లోపు ఉండాలన్నారు. వైవీయూ అనుబంధ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు. క్రీడాకారులు పదోతరగతి, ఇంటర్మీడియట్ ఒరిజినల్ స్టడీ సర్టిఫికెట్లు మిగతా అన్ని స్టడీ సర్టిఫికెట్ల జిరాక్స్‌లతో హాజరుకావాలని సూచించారు.

వైవీయూ డిగ్రీ పరీక్షలు వాయిదా

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వైవీయూ పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాలల విద్యార్థులకు సోమవారం జరగాల్సిన సెమిస్టరు పరీక్షలు రద్దు చేసినట్లు వైవీయూ పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసరు క్రిష్ణారావు తెలిపారు. వైస్‌ఛాన్సలరు క్రిష్ణారెడ్డి ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామని, తదుపరి తేదీని తెలియజేస్తామన్నారు.



విద్యార్థుల సంక్షేమం, భద్రతకు ప్రభుత్వం కృషి

● రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



మంత్రి మండిపల్లికి వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ నాయకులు

రాయచోటిటౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల భద్రత, సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. సోమవారం ఆయన స్వగ్రామంలో కడప కేంద్రీయ విద్యాలయ పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రుల సంఘం నాయకులు విద్యార్థులకు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించేందుకు రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల భద్రత, వారి సంక్షేమం కోసం మరిన్ని కార్యక్రమాలు తీసుకువస్తుందన్నారు. కేంద్రీయ విద్యాలయం కోసం మరో రెండు బస్సులు సమకూర్చాలని కోరడంతో సానుకూలంగా స్పందించిన ఆయన ఆర్టీసీ అధికారులతో మాట్లాడి బస్సులు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కడప కేంద్రీయ విద్యాలయ పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రుల కన్వీనర్ చంద్రగిరి నారాయణ, సంఘం ట్రెజరర్ జితేంద్ర, కోకన్వీనర్లు వస్త్రాల నరసింహులు, చింతలపల్లి జయ, విశ్వనాథ, సురేంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయించండి

మండలంలో అత్యధిక పల్లెలు, జనాభా కలిగిన మాధవరం పంచాయతీ కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయాలని కోరుతూ సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ అన్నమయ్య జిల్లా నాయకుడు మావులూరి విశ్వనాథ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. మాధవరంలో సీసీ రోడ్ల భూమి పూజ కార్యక్రమానికి వచ్చిన సందర్భంగా ఈ మేరకు విన్నవించారు. అనంతరం మాట్లాడుతూ రాయచోటి మండలంలోని మాధవరం పంచాయతీలో ఆరోగ్య కేంద్రం లేకపోవడంతో సుమారు 33 గ్రామాల ప్రజలు వైద్య చికిత్సల కోసం 15 కిలోమీటర్ల దూరంలోని రాయచోటికి వెళ్లాల్సి వస్తోందన్నారు. మాధవరం గ్రామంలో ఆరోగ్య కేంద్రం ఏర్పాటుకు కృషి చేయడమే కాకుండా, గాలివీడు సమీపంలోని వెలిగల్లు ప్రాజెక్టు నుంచి సాగు, తాగునీరు అందించేందుకు కృషి చేస్తామని మంత్రి వారికి హామీ ఇచ్చారు.

చిన్నమండెంలో ప్రజా దర్బార్

చిన్నమండెం: మండలంలోని బోరెడ్డిగారిపల్లెలో మంత్రి నిర్వహించిన ప్రజా దర్బార్‌కు జిల్లా నలుమూలల నుంచి ప్రజలు తరలివచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మండల స్థాయి అధికారులు ప్రజా సమస్యలను అక్కడికక్కడే పరిష్కరిస్తే ప్రజా దర్బార్‌కు ఎక్కువ మంది ప్రజలు రారన్నారు. అనంతరం అర్జీలను స్వీకరించి సంబంధిత అధికారులకు ఎండార్స్ చేశారు.

మా సోదరి వివాహానికి రండి

● సీఎం, డిప్యూటీ సీఎంలకు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ ఆహ్వానం



డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌ను ఆహ్వానిస్తున్న అరవ శ్రీధర్

రైల్వేకోడూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): తన సోదరి వివాహానికి రావాలంటూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్‌ను రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ ఆహ్వానించారు. సోమవారం వారిని కలిసి తన సోదరి వివాహ శుభలేఖ అందజేశారు. ఈ నెల 7న కడపలో వివాహం జరుగుతుందని తప్పక రావాలని ఆహ్వానించారు.

నిరుపేద కుటుంబానికి చేయూత

సిద్దవటం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పక్షవాతంతో బాధపడుతున్న మండలంలోని మాధవరం-1 ఎస్సీ కాలనీకి చెందిన చిన్నక్క(53)కు మన ఊరికోసం స్వచ్ఛంద సంస్థ చైర్మన్ రవిశంకర్ రూ.12 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాతలు ఈ నిరుపేద కుటుంబానికి అండగా నిల వాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పుత్తా శ్రీనివాసులు, సుధీర్ పాల్గొన్నారు.

చెరువులు, కుంటలకు జలకళ



పెనగలూరు: వెలగచర్ల వద్ద గుంజనేటి అలుగుపై పారుతున్న వరదనీరు

రాజంపేట టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని చెయ్యేరుతోపాటు, కుంటలు, చెరువుల జలకళ సంతరించుకున్నాయి. పింఛ ప్రాజెక్టు నుంచి వరదనీరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పుల్లంగేరు పరవళ్లు తొక్కడంతో రాజంపేట పట్టణంలోని పోలి చెరువుకు వరదనీరు భారీగా చేరుతోంది. ఈ వర్షానికి చెరువు పూర్తి స్థాయిలో నిండకపోయినా, నీటి సమస్యలు తలెత్తకుండా పట్టణవాసులకు ఊరట లభించింది.

పెనగలూరు: భారీ వర్షాలకు మండలంలోని గుంజనేరు ఉధృతంగా ప్రవహిస్తోంది. చాలాకాలం తర్వాత గుంజనేరులో సమృద్ధిగా నీరు పారు తుండడంతో సమీప గ్రామాల ప్రజలు ఆసక్తిగా తిలకిస్తున్నారు.

నందలూరు: మండలంలోని చెయ్యేరు జలకళను సంతరించుకుంది. దీంతో భూగర్భజలాలు పెరిగే అవకాశం ఉంది. దీంతో రైతులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సిద్దవటం: మండలంలోని కపర్దీశ్వరకోనలో వాగులు పొంగుతున్నాయి ప్రవహిస్తున్నాయి.

సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సిద్ధం

● రాష్ట్ర ఖాదీ, గ్రామీణ పరిశ్రమల కార్పొరేషన్ చైర్మన్ కేకే చౌదరి

రైల్వేకోడూరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందని రాష్ట్ర ఖాదీ, గ్రామీణ పరిశ్రమల కార్పొరేషన్ చైర్మన్ కేకే చౌదరి తెలిపారు. సోమవారం విజయవాడలోని మంగళ గిరి టీడీపీ కార్యాలయంలో గుంటూరు ఎమ్మెల్యే నజీర్, ఒంగోలు జిల్లా టీడీపీ అధ్యక్షుడు, ఏపీ టూరిజం అభివృద్ధి చైర్మన్ నూకసాని బాలాజీతో కలసి ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరిస్తున్నామన్నారు.

శ్మశాన భూమి ఆక్రమణలు అడ్డుకోండి

రాయచోటి(కలెక్టరేట్), డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): శ్మశానంగా వినియోగిస్తున్న భూమిని సమాధులు తవ్వేసి మరీ ఆక్రమిస్తున్నారని, ఈ ఆక్రమణలు అడ్డుకోవాలని మండలంలోని దిగువ అబ్బ వరం గ్రామానికి చెందిన మ హిళలు సోమవారం జాయిం ట్ కలెక్టరుకు విన్నవించారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని సర్వే నెంబరు 269/1లోని 8.22 పోరం బోకు భూమిని ఎన్నోఏళ్లుగా తాము శ్మశానంగా వినియోగించుకుంటు న్నామన్నారు. రెండేళ్లుగా ఇతర ప్రాంతాలకు చెందిన వ్యక్తులు ఈ భూమి లోని సమాధులు తవ్వేసి గుడిసెలు వేసుకుని క్రమంగా ఆక్రమిస్తున్నారని ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై విచారణ చేసి కఠిన చర్యలు తీసుకుంటా మని జాయింట్ కలెక్టర్ హామీ ఇచ్చినట్లు తెలిపారు.

డెంగ్యూ,మలేరియాపై అప్రమత్తంగా ఉండాలి



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ కొండయ్య

ఓబులవారిపల్లె, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) :డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో డాక్టర్ కొండయ్య హెచ్చరించారు. మంగంపేట పరిధి లోని ముక్కావారి పల్లె ప్రభుత్వ వైద్యశాల డాక్టర్ రాజశేఖర్ ఆధ్వర్యంలో ఏ ర్పాటు చేసిన మెడికల్ క్యాంపును పరిశీలించారు. అనంతరం మండల కేంద్రంలోని మంగంపేట ఏపీఎండీసీ పరిధిలో వైద్య సదుపాయాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డెం గ్యూ, మలేరియా వంటి వ్యాధుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, ప్రస్తుత వాతావరణంలో వ్యాధులు వ్యాపించకుండా చర్యలు తీసుకోవాలని ఏఎన్ఎం, ఆశ వర్కర్లకు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేడు అంగన్వాడీ వర్కర్లకు శిక్షణ

చిట్వేలి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఉల్లాస్ కార్యక్రమంపై మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అంగన్వాడీ కార్యకర్తలకు ఒక రోజు శిక్షణ ఇస్తున్నట్లు ఎంపీడీవో మోహన్ సోమవారం తెలియజేశారు. ఉల్లాస్ యోజన ద్వారా విద్యను అందించేందుకు మండలంలో 57 అంగన్వాడీ కేంద్రాలను గుర్తించినట్లు ఎంపీడీవో తెలిపారు. ఇలా గుర్తించిన కేంద్రాలకు చెందిన వలంటీర్లు, అంగన్వాడీ టీచర్లు ఈ శిక్షణకు హాజరు కావాలని ఎంపీడీవో తెలియజేశారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ గ్రామ సభ

సిద్దవటం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని 2023-24 ఉపాధిహామీ సామాజిక తనిఖీల గ్రామసభలు సోమవారం గ్రామ సర్పంచ్‌ల అధ్యక్షతన బొగ్గిడివారిపల్లె, మాధవరం, మూలపల్లె, జంగాలపల్లె, శాఖరాజుపల్లె, నేకనాపురం గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. మాధవరం గ్రామసభలో ఫీల్డ్ అసిస్టెంట్‌పై ఆరోపణలు రావడంతో విచారణ చేస్తామని ఏపీవో నరసింహులు తెలిపారు. మస్టర్‌లో సంతకాలు లేకున్నా డబ్బులు ఇవ్వడం ఈ సామాజిక తనిఖీల్లో వెలుగుచూసింది. పక్కాగృహ నిర్మాణం చేస్తున్న హసీనాబేగంకు అందాల్సిన డబ్బు వేరేవారి ఖాతా జమ కావడం చర్చనీయాంశంగా మారింది. వీటన్నిటిపై సమగ్ర విచారణ జరపాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు.

నీటి నిల్వలు ఎప్పటికప్పుడు పరిశీలించాలి



పింఛా ప్రాజెక్టును పరిశీలిస్తున్న ఈఈవెంకట్రామయ్య

సుండుపల్లె, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): నీటి నిలువలు ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉం డాలని ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకట రామయ్య, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చంగలరాయుడుతెలిపారు. సోమ వారం మండలంలోని యర్రపురెడ్డి ఆదినారాయణ రెడ్డి పింఛా ప్రాజెక్టును వారు పరిశీలించారు. పింఛా ప్రాజెక్టుకు నీరు చేరుతుండడంతో రాత్రి పూట ఎప్పటికప్పుడు నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తూ ఉండాలన్నారు. వరద ఉధృతి అధికంగా ఉన్నపుడు కాలు వల ద్వారా నీరు విడుదల చేయాలని సూచించారు. పై ప్రాంతాల నుంచి 1630 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టులోకి చేరుతోంద న్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఈ నాగేంద్ర నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

తుఫాన్ బాధితుడికి ఆర్థిక సాయం

ఓబులవారిపల్లె, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఫెంగల్ తుఫాను కారణంగా పెంకుటిల్లు కూలిపోవడంతో ఇబ్బందులు పడుతున్న దివ్యాంగుడి కుటుంబాన్ని ముక్కా రూపానందరెడ్డి ఫౌండేషన్ ఆదుకుంది. మండలంలోని చిన్నఓరంపాడు పంచాయతీ అయ్యలరాజుపల్లె హరిజనవాడకు చెందిన దాసరి సుబ్రమణ్యం ఇల్లు కూలిపోయిన విషయం సామాజిక మాధ్యమాల ద్వారా తెలుసుకున్న ముక్కా వరలక్ష్మి సోమవారం రూ.15 వేలు నగదు, దుప్పట్లు పంపిణీ చేశారు. గ్రామంలోని దాసరి సుబ్బమ్మ, దాసరి లక్ష్మీసుజాత నివసించే పెంకుటిల్లు పైకప్పు కూలి ప్రమాదకరంగా ఉందని తెలియడంతో, పంచాయతీ సిబ్బంది ఎంపీడీవో మల్‌రెడ్డి, తహసీల్దారుతో కలసి వారి గృహాలు పరిశీలించారు. రేషన్‌కార్డుల మంజూరు, కుటుంబ సభ్యుల నమోదు, ఇళ్ల మంజూరుకు గ్రామ సచివాలయాల్లో నమోదు చేసుకోవాలని ఎంపీడీవో మల్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ రామ్మోహన్‌రెడ్డి, టీడీపీ నాయకులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీ కాలనీలో ఎంపీడీవో పర్యటన

ఓబులవారిపల్లె, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : వర్షం కారణంగా పలు ఇళ్లు దెబ్బ తినడంతో ప్రజలు ఇబ్బంది లు పడుతున్నారని సమా చారం అందడంతో ఎంపీడీవో మల్‌రెడ్డి, ఈవోపీఆర్డీ రామ్మో హన్‌రెడ్డి సోమవారం మండ ల పరిధిలోని వైకోట గ్రామ పంచాయతీ రాములమ్మ ఎస్టీ కాలనీని సందర్శించారు. సుమారు 40 ఇళ్లు దెబ్బతిన్నట్లు గుర్తించారు. అనంతరం వారు మాట్లాడుతూ అర్హులైనవారికి పరిహారం మంజూరు చేస్తామని, సచివాలయంలో వివరాలు నమోదు చేసుకోవాలని తెలిపారు.

రాష్ట్ర స్థాయి ఖోఖో విన్నర్ సంజీవపురం గురుకులం

ఓబులవారిపల్లె, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని సంజీవపురంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు గురుకుల పాఠశాల సొసైటీ ఆధ్వర్యంలో పెదవేగిలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల్లో విజేతలుగా నిలిచారని ప్రిన్సిపాల్ మన్సూర్‌అలీ తెలి పారు. ఫిజికల్ డైరెక్టర్ విజయానందమూర్తి, పీఈటీ సురేంద్ర ఆధ్వర్యంలో తమ పాఠశాల విద్యార్థులు మెరుగైన ప్రతిభ కనబరచి కప్‌లు, పతకాలు, ప్రశంసాపత్రాలు పొందడం గురుకుల పాఠశాలకు గర్వకారణమని తెలిపారు. సోమవారం వారు సాధించిన కప్‌లు, పతకాలు, ప్రశంస పత్రాలను పాఠశాలలో ప్రదర్శించారు. వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఘనంగా పోలి పాడ్యమి

రామాపురం, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం పోలి పాడ్యమి పాటించారు. పోలి పాడ్యమి రోజు దీపాలు వెలిగిస్తే కార్తీక మాసం అంతా దీపాలు పుణ్యం లభిస్తుందన్న ఉద్దేశంతో మహిళలు సోమవారం తెల్లవారు జామున దీపాలు వెలిగించి భక్తిని చాటుకున్నారు. హసనాపురం మూలస్థానేశ్వర దేవాలయం, స్థానిక హరిహరాలయంలోనూ, గువ్వలచెరువు ఘాట్‌పైన ఉన్న భవానీ శంకరాలయంలో దీపాలు వెలిగించారు.

తాగునీటి సమస్య పరిష్కారం

రామాపురం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని కసిరెడ్డిగారిపల్లె పంచాయతీ వడ్డెపల్లెలో సోమవారం తాగునీటి బోరు ఏర్పాటు చేశారు. గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను మంత్రి మండిపల్లి దృష్టికి తీసుకెళ్లడంతో ఈ మేరకు ఆయన చర్యలు తీసుకున్నారని టీడీపీ నాయకులు బాలిశెట్టి చంద్రమౌళి, బండారు తిమ్మారెడ్డి, చిట్టి రెడ్డెయ్య, విద్యా కమిటీ చైర్మన్ కృష్ణయ్య తదితరులు తెలిపారు.

యాదవ సంఘం ప్రచార కార్యదర్శిగా ఓబులేసుయాదవ్

రాయచోటిటౌన్, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): అఖిల భారత యాదవ మహా సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా డీఎం ఓబులేసు యాదవ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం రాయచోటిలో నిర్వహించిన యాదవుల సమైక్య సభలో ఈ ఎన్నిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఓబులేసు యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలో కులగణన చేసి యాదవుల జనాభా తేల్చాలని, ఓట్ల ప్రాతిపదికన ఎమ్మెల్యే, ఎంపీ సీట్లను కేటాయించి రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో యాదవులపై దాడులు, అన్యాయాలపైన న్యాయ పోరాటం చేస్తానని తెలిపారు. ఈ ఎన్నికకు సహక రించిన జాతీయ, రాష్ట్ర నాయకత్వానికి ధన్యవాదాలు తెలియజేశారు.

ఏఎస్పీకి సన్మానం

రాయచోటిటౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా అదనపు (అడ్మిన్) ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన వెంకటాద్రిని సోమవారం టీడీపీ బీసీ సాధికార సమితి, పాల ఏకరి రాష్ట్ర కన్వీనర్ గురిగింజకుంట శివప్రసాద్‌నాయుడు, జనసేన పార్టీ రాజంపేట పార్లమెంట్ నాయకుడు రామా శ్రీనివాస్ కలిసి పూలమాల, శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. బడుగు, బలహీన వర్గాలకు సకాలంలో న్యాయం జరిగేలా చూడాలన్నారు.

కష్టపడి పని చేసిన వారికే ప్రాధాన్యం



సమావేశంలో ప్రసంగిస్తున్న జగన్‌మోహన్‌రాజు

సుండుపల్లె, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కోసం కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరికీ తప్పనిసరిగా ప్రాధాన్యం లభిస్తుందని రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో ఆయన కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసీపీ నుంచి వచ్చిన కొంత మంది నేతలు గత ప్రభుత్వంలో చేసిన తప్పులు కప్పిపుచ్చుకునేందుకు టీడీపీ ముసుగు వేసుకున్నారని విమర్శించారు. అలాంటి వారిని పార్టీ నాయ కులు, కార్యకర్తలు పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. కొంతమంది అధికారులు ఇంకా వైసీపీ ప్రభుత్వంలో ఉన్నా మన్న భ్రమలో ఉన్నారని, అలాంటి వారిపై పార్టీ హైకమాండ్ కు ఫిర్యాదు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు మండలంలో అభివృద్ధి పనులను సైతం అడ్డుకుంటున్నారని అసహనం వ్యక్తం చేశారు. మండల టీడీపీ అధ్యక్షుడు కళ్లే రెడ్డెప్ప, మండల ప్రధాన కార్యదర్శి ప్రసాద్‌రాజు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు మోహన్‌బాబునాయుడు, పింఛ నీటి సంఘం మాజీ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల పనులకు భూమిపూజ

వీరబల్లి: కూటమి ప్రభుత్వంలోనే గ్రామీణ రోడ్లకు మహర్దశ చమర్తి జగన్‌మోహన్‌రాజు తెలిపారు. సోమవారం మండలంలోని తాటికుంటపల్లి పంచాయతీ నాయునివారిపల్లె కొత్తపల్లి, వీరబల్లి గడికోట పంచాయతీల్లో సీసీ రోడ్లకు ఆయన భూమిపూజ చేశారు. కాగా ఈ పనుల ప్రారంభోత్సవంలో ప్రొటోకాల్ పాటించలేదని వీరబల్లి సర్పంచ్ రాణెమ్మ ఆరోపించారు. విషయంపై జిల్లా కలెక్టర్, పంచాయతీరాజ్ కమిషనర్ కు ఫిర్యాదు చేస్తామన్నారు.

వర్షం.. రైతుకు కష్టం...

- ఉద్యాన పంటలపై తుఫాన్ దెబ్బ
- వరద నీటిలో అరటి, బొప్పాయి, మామిడి తోటలు
- ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోతున్న రైతులు


నీటిలో మునిగిన చీనీ, నిమ్మ అంటుమొక్కలు

రైల్వేకోడూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఏటా ప్రకృతి వైపరీత్యాలతో రైతులు పంటలను నష్టపోతూనే ఉన్నారు. ప్రస్తుతం తుఫాన్ ఉద్యాన పంటలపై పంజా విసిరింది. దీంతో ఇటు మామిడి, బొప్పాయి పంటలకు తీవ్ర నష్టం ఏర్పడింది. ఒకవైపు అరటి కాయలకు ధరలు లేక తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. మామిడికి డిసెంబరు మాసం నుంచే పూతలు ప్రారంభం కావాల్సి ఉండగా ఇంతవరకు రాలేదు. భూమిలో తేమ శాతం అధికం కావడంతో ఆలస్యంగా పూతలు వస్తాయని ఉద్యానశాఖ, శాస్త్రవేత్తలు చెబుతున్నారు. రైల్వేకోడూరు నియోజకవర్గం ఉద్యాన పంటలకు కేంద్ర బిందువు. ఇక్కడ ఎక్కువగా అరటి, బొప్పాయి, మామిడి పంటలను రైతులు పండిస్తారు. మామిడి 20 వేల హెక్టార్లు, అరటి 15 వేల హెక్టార్లు, బొప్పాయి 15 వేల హెక్టార్లలో సాగు చేస్తున్నారు. ఇక్కడ పండే ఉద్యాన పంటలను ఢిల్లీ, మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటక, ఉత్తర ప్రదేశ్, మధ్యప్రదేశ్, కేరళ, పంజాబ్, హిమాచల్‌ప్రదేశ్ తదితర నగరాలకు ఎగుమతి చేస్తున్నారు. ప్రతి ఏటా కోట్లాది రూపాయల వ్యాపారం జరుగుతుంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా అరటి, మామిడి, బొప్పాయి తోటల వైపు రైతులు వెళ్లడం లేదు. మామిడికి వర్షాలు రాకమునుపు వేలాది రూపాయలు ఖర్చు చేసి మందులు పిచికారీ చేశారు.

కొట్టిన మందులు నీటి పాలయ్యాయని రైతులు వాపోతున్నారు. ముందస్తుగా వచ్చిన రుమాణి మామిడి కాయలకు మంగు ఏర్పడింది. కొనేవారు లేక రైతులు కిలో రూ.4 నుంచి రూ.5కు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. టిష్యూకల్చర్ అరటి, బొప్పాయి నర్సరీల్లో వర్షపు నీరు చేరడంతో వ్యాపారులు తీవ్రంగా నష్టపోతున్నారు. వరి నాట్లు వేసుకోవడానికి చెరువుల కింద నార్లు పోశారు. వర్షం తగ్గకపోవడంతో రైతులు ఏమీ చేయలేని పరిస్థితి ఏర్పడింది.

నాటిన బొప్పాయి మొక్కలు చనిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. గుండాలపల్లె, బయనపల్లె, తిమ్మిశెట్టిపల్లె, ఓబనపల్లె, అనంతరాజుపేట తదితర గ్రామాల్లో అంటుమొక్కలకు అసలే ధరలు లేవు. అవి కూడా దెబ్బతింటున్నాయని రైతులు, వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైతుల అవసరాలకు సాగు చేస్తున్న పూల తోటలు, కూరగాయల తోటలు దెబ్బతింటున్నాయి.

ప్రతి ఏటా కురుస్తున్న భారీ వర్షాలు, పెనుగాలుల వల్ల ఉద్యాన పంటల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. అరటి తోటలు వర్షం దెబ్బకు నానిపోయి కూలిపోతున్నాయి. ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటున్నారు.


బొప్పాయి తోటలో చేరిన వర్షం నీరు

మామిడి రైతులను ఆదుకోవాలి



మామిడి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి. ముందుగా వచ్చిన పూతలు మాడిపోయినాయి. డిసెంబరు మాసం నుంచి పూతలు రావాల్సి ఉంది. వర్షంతో పూతలు ఆలస్యంగా వచ్చే అవకాశాలు ఉన్నాయి. భూమిలో తేమ శాతం అత్యధికంగా ఉండడంతో మామిడిని దెబ్బతీస్తుంది. మామిడికి ఎక్కువ వేడి ఉండాలి. ప్రభుత్వమే మామిడి రైతులను ఆదుకోవాలి.

\- మంకు సుబ్రహ్మణ్యం, రైతు, శెట్టిగుంట

వర్షాలతో రైతులు గుల్ల



రైతు, శెట్టిగుంట ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో రైతులు గుల్లయ్యారు. చేతికి అందాల్సిన పంటలు రాలేదు. పెట్టిన పెట్టుబడులు కూడా అందడం లేదు. నష్టాలు వస్తున్నాయే తప్ప లాభాలు, పెట్టుబడి రావడం లేదు. అధికారులు పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక పంపాలి.

\- పి.దుర్గయ్య, రైతు, శెట్టిగుంట

ఉచితంగా విత్తనాలు ఇవ్వాలి



రైతులకు బొప్పాయి విత్తనాలతో పాటు మామిడి మొక్కలు, అరటి మొక్కలు ఇవ్వాలి. ప్రభుత్వమే నేరుగా సరఫరా చేయాలి. రైతుల ఇబ్బందులను పరిశీలించి తగిన న్యాయం చేయాలి. రైతు బాగుంటే దేశం బాగుంటుంది.

\- చంద్ర, న్యాయవాది, శెట్టిగుంట

ఉద్యోగులందరూ ఒకే గదిలోనే...

- రికార్డులు పెట్టుకోవడానికీ గదులు లేవు
- పోస్టర్లు, కరపత్రాలన్నీ వరండాలోనే
- ఇదీ డీఎంహెచ్‌వో కార్యాలయం దుస్థితి


డీఎంహెచ్‌వో కార్యాలయ వరండాలోనే ఉంచిన పోస్టర్లు, బ్యానర్లు, కరపత్రాలు

రాయచోటి (కలెక్టరేట్), డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాల ఏర్పాటులో గత ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల కొన్ని శాఖలకు తీరని అన్యాయం జరిగింది. హడావుడిగా జిల్లాలు ఏర్పాటు చేయడంలో వైద్య ఆరోగ్యశాఖకు అన్యాయం జరిగిందని వాదన ఉంది. ఇంత పెద్ద జిల్లాకు డీఎంహెచ్‌వో కార్యాలయాన్ని ప్రైవేటు భవనాల్లో కేటాయిస్తూ అందులోనూ వసతులు లేనటువంటి భవనాలు కేటాయించడంలో గత ప్రభుత్వం నిర్లక్ష్యం చూపిందని ఆ శాఖ సిబ్బంది వాపోతున్నారు.

దాదాపు సంవత్సరం తర్వాత నేషనల్ హైవేకి ఆనుకుని ఉన్న ఎస్టీ బాలుర హాస్టల్‌లో కేటాయిస్తూ అప్పటి కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే దాదాపు పది మంది సెక్షన్లకు సంబంధించిన అధికారులు ఒకే గదిలో కూర్చుని ఉద్యోగం చేస్తున్నటువంటి పరిస్థితి ఇక్కడ ఉంది. ప్రజల ఆరోగ్యాలు కాపాడే ఈ శాఖకు కనీస వసతులు కూడా కల్పించలేదు. ఆరోగ్య పరిస్థితులపై ప్రజలకు అవగాహన కల్పించే పోస్టర్లు, కరపత్రాలు, బ్యానర్లు, ఇతర సామగ్రి అంతా కూడా కార్యాలయం బయట వరండాలోనే పెట్టుకోవాల్సిన పరిస్థితి ఉంది. ఇంత పెద్ద కార్యాలయానికి ప్రహరీ కూడా లేకపోవడం వల్ల రకరకాల విషపురుగులు వస్తున్నాయని సిబ్బంది వాపోతున్నారు. జిల్లాకు కావాల్సిన మెటీరియల్ మొత్తం ఈ కార్యాలయానికి వస్తే అవి ఎక్కడ ఉంచాలో తెలియక సిబ్బంది తలలు పట్టుకుంటున్నారు. ఇక్కడ పనిచేస్తున్న సిబ్బందికి తాగునీరు లేదు, మరుగుదొడ్లు కూడా సరిగ్గా లేవని చెబుతున్నారు. ఈ విషయంపై డీఎంహెచ్‌వో కొండయ్యను వివరణ కోరగా మాకు రూము అయితే సరిపోవడం లేదు. సిబ్బంది కూడా చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

తుఫాన్‌తో పూల రైతులకు తీవ్ర నష్టం


వాల్మీకిపురంలో తోటలోనే వదిలేసిన చామంతి పూలు

వాల్మీకిపురం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రైతులు ఆరుకాలం శ్రమించి సాగు చేసిన పంటలు కోత సమయాన నష్టాలను చవి చూడాల్సి వస్తోంది. నాలుగు రోజులుగా కురుస్తున్న తుఫాన్ కారణంగా పూల రైతులు తీవ్రంగా నష్టపోయారు. వాల్మీకిపురం మండల వ్యాప్తంగా దాదాపు 40 నుంచి 50 ఎకరాలలో రైతులు బంతి, చామంతి పూల తోటలు సాగు చేశారు. అయితే తుఫాన్ ప్రభావంతో నాలుగు రోజుల నుంచి తుంపర్ల వర్షం కురుస్తుండటంతో పాటు ముసురు కమ్మేయడం వలన పూల తోటలు దెబ్బతిన్నాయి. దీంతో బంతి, చామంతి పూలను తోటల్లోనే రైతులు వదిలేశారు. అంతేకాకుండా వర్షంతో తోటల్లోనే పూలు కుళ్లిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. మార్కెట్‌లో బంతి పూలు కిలో రూ.50, చామంతి పూలు కిలో రూ.120 ఉన్నప్పటికీ తుఫాన్ కారణంగా తడిచిపోయిన పూల దిగుబడులను మార్కెట్లకు తరలించడం ద్వారా చామంతి కిలో రూ.40, బంతి పూలు కిలో రూ.15 పలుకుతుండటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

5న కలికిరిలో రీజనల్ పాలిటెక్ ఫెస్ట్

కలికిరి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కలికిరి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం నుంచి రెండు రోజుల పాటు ప్రాంతీయ పాలిటెక్ ఫెస్ట్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాసులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా స్థాయిలో నిర్వహిస్తున్న ఈ పాలిటెక్ ఫెస్ట్‌ను 5వ తేదీ గురువారం ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి ప్రారంభిస్తారని చెప్పారు. జిల్లాలోని మొత్తం 20 పాలిటెక్నిక్ కళాశాలలకు చెందిన 344 మంది పాలిటెక్నిక్ విద్యార్థులు ఈ ప్రాంతీయ పాలిటెక్ ఫెస్ట్‌లో పాల్గొంటారని వివరించారు.

కలికిరి పట్టణంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల్లోని 9, 10 తరగతుల విద్యార్థులు కూడా ఈ ఫెస్ట్‌కు హాజరుకానున్నట్లు చెప్పారు. పాలిటెక్నిక్ విద్యాభ్యాసం ప్రాధాన్యత గురించి అవగాహన పెంచుకోవడానికి ఈ ఫెస్ట్ మంచి వేదికగా ఉంటుందని పేర్కొన్నారు.

మల్టీ గ్రైన్ ఇన్‌స్టెంట్ పౌడర్ల తయారీ

విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై మహిళలకు శిక్షణ


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ మంజుల

కలికిరి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో ఐదు రోజులుగా జరుగుతున్న విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై శిక్షణలో భాగంగా చివరి రోజు సోమవారం చిరుధాన్యాలతో 30 రకాల మల్టీ గ్రైన్ ఇన్‌స్టెంట్ పౌడర్ల తయారీని విజయవంతంగా పూర్తి చేసినట్లు కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ మంజుల తెలిపారు. మల్టీ గ్రైన్ పౌడర్లతో పాటు బొప్పాయి క్యాండీస్ కూడా తయారు చేసినట్లు ఆమె వెల్లడించారు.

ఐదు రోజులుగా విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై గ్రామీణ మహిళలకు జరుగుతున్న శిక్షణలో భాగంగా సోమవారం జరిగిన ముగింపు సమావేశంలో ఆమె మాట్లాడుతూ మొదటిసారిగా వివిధ రకాల చిరుధాన్యాలతో మల్టీ గ్రైన్ ఇన్‌స్టెంట్ పౌడర్లు తయారు చేయడంలో మెలకువలను నేర్పించినట్లు చెప్పారు. ఈ పౌడర్లతో వివిధ రకాల ఆరోగ్యవంతమైన పానీయాలను తయారు చేసుకోవచ్చునని చెప్పారు. విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ శిక్షణలో భాగస్వామ్యంతో పాల్గొన్న కలికిరికి చెందిన మంజుల, అమ్మాజీ మాట్లాడుతూ కొర్ర, రాగి లాంటి చిరుధాన్యాలతో బిస్కెట్లు, మురుకులు తదితర పదార్థాల తయారీతో ఆదాయాన్ని పెంచుకోవాలని తెలిపారు. మల్టీ గ్రైన్ ఇన్‌స్టెంట్ పౌడర్లను జావ రూపంలోనూ, దోసె పిండిలో కలుపుకుని వినియోగించుకోవచ్చని సూచించారు. లడ్డూ, బజ్జీల తయారీలో కూడా ఈ పౌడర్లను కలిపి తయారు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు, శిక్షణ పొందిన మహిళలు, కేవీకే సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


పీలేరులో జరిగిన మెడికల్ క్యాంపులో డీఐవో ఉషశ్రీ

పీలేరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉంటూ అవి ప్రబలకుండా చూసుకోవాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారిణి డాక్టర్ ఉషశ్రీ వైద్య ఆరోగ్య శాఖ సిబ్బందిని హెచ్చరించారు. మండలంలోని తలపుల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సోమవారం పీలేరు పట్టణం సైనిక్‌నగర్‌లో జరిగిన ఉచిత వైద్య శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా కాన్పులకు దగ్గరగా ఉన్న గర్భిణీలు, బాలింతలు, మంచానికి పరిమితమైన వృద్ధులు, నవజాత శిశువులు, చిన్నారులను జాగ్రత్తగా చూసుకోవాలని ప్రజలకు సూచించారు. వెచ్చటి వాతావరణం, పరిసరాల పరిశుభ్రత, సురక్షిత నీరు, నవజాత శిశువులకు తల్లిపాలు, గర్భిణులు తాజా ఆకు కూరలు తీసుకోవాలన్నారు. వర్షాల ఉధృతి తగ్గే వరకు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించే ప్రజలను చైతన్యవంతుల్ని చేయడమే కాకుండా వ్యాధులకు మందులు పంపిణీ చేయాలని సిబ్బందికి తెలియజేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి రమేశ్‌రెడ్డి, హెచ్‌ఈ కొండయ్య, సూపర్‌వైజర్ కుసుమ, ఏఎన్ఎంలు భార్గవి, ప్రమీల, సీహెచ్‌వో చంద్రకళ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

స్కౌట్‌తో విద్యార్థుల్లో క్రమశిక్షణ : డీఈవో



శిక్షణలో మాట్లాడుతున్న డీఈవో సుబ్రమణ్యం

రాయచోటిటౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో క్రమశిక్షణ, దేశభక్తి, సామాజిక సేవ పెంపొందడానికి స్కౌట్ శిక్షణ తోడ్పడుతుందని డీఈవో సుబ్రమణ్యం అన్నారు. రాయచోటి పట్టణంలోని అర్చనా కళాశాలలో సోమవారం నుంచి స్కౌట్ మాస్టర్లు, గైడ్ కెప్టెన్లకు ఏడు రోజుల శిక్షణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్ మాస్టర్లు, కెప్టెన్లు అందరూ సేవాభావం, క్రమశిక్షణతో పనిచేయాలన్నారు. ప్రభుత్వ ప్రైవేటు, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్‌ను తప్పనిసరిగా ఏర్పాటు చేసేందుకు సంబంధిత ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకోవాలన్నారు. అకడమిక్ క్యాలెండర్ ప్రకారం వారంలో ఒకరోజు స్కౌట్స్ అండ్ గైడ్స్‌కు ఒక పీరియడ్ కేటాయించామన్నారు. స్కౌటిజంతో చిన్ననాటి నుంచే విద్యార్థుల్లో సేవాభావం అలవడుతుందన్నారు. అనంతరం అర్చన విద్యాసంస్థల కరస్పాండెంట్ మదన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ తల్లిదండ్రులు, గురువులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించడంతో పాటు సమాజంలో బాధ్యతగా వ్యవహరించడానికి ఈ శిక్షణ తోడ్పడుతుందన్నారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యదర్శి మడితాటి నరసింహారెడ్డి, ట్రెజరర్ మార్ల ఓబుల్‌రెడ్డి, అసిస్టెంట్ స్టేట్ ఆర్గనైజింగ్ కమిషనర్ లక్ష్మీకర, జిల్లాలోని స్కౌట్ మాస్టర్లు, గైడ్ కెప్టెన్లు పాల్గొన్నారు.

ఉరి వేసుకుని ఆటో డ్రైవర్ మృతి

తంబళ్లపల్లె, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఉరి వేసుకుని ఆటో డ్రైవర్ మృతి చెందిన సంఘటన సోమవారం మండలంలో జరిగింది. కుటుంబసభ్యులు, పోలీసుల కథనం మేరకు...తంబళ్లపల్లె మండలం రేణుమాకులపల్లె పంచాయతీ మిట్టమాలపల్లెకు చెందిన రమణయ్య (49) ఆటో నడుపుకుంటూ కుటుంబ పోషణ సాగించేవాడు. దురలవాట్లకు బానిసై కుటుంబాన్ని పట్టించుకోలేదు. దీంతో కుటుంబసభ్యులు మందలిచడంతో మనస్థాపం చెంది గ్రామానికి సమీపంలోని చెట్టుకు ఉరి వేసుకుని మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ లోకేష్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

జెండా దినోత్సవ స్టిక్కర్ల ఆవిష్కరణ


స్టిక్కర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, తదితరులు

రాయచోటి (కలెక్టరేట్), డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సాయుధ దళాల జెండా దినోత్సవం (డిసెంబరు 7) సందర్భంగా ప్రత్యేక స్టిక్కర్లను సోమవారం కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జేసీ ఆదర్శ్ రాజేంద్రన్, కడప జిల్లా సైనిక్ వెల్ఫేర్ అధికారి రజాక్‌ఖాన్, పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సాయుధ దళాల త్యాగాలు, సేవలను గుర్తించేందుకు జెండా దినోత్సవం ఒక ప్రత్యేకమైన అవకాశం అని తెలిపారు. మాజీ సైనికులు, వీరనారులు, వారి కుటుంబాల సంక్షేమానికి మద్దతుగా ప్రజలు స్వచ్ఛందంగా విరాళాలు అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

బినామీ సంఘమిత్రలను తొలగించండి

- డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ

గుర్రంకొండ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గుర్రంకొండ మండలంలో బినామీ సంఘమిత్రలుగా పనిచేసే వారిని విధుల నుంచి తొలగించాలని డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ ఆదేశించారు. స్థానిక కార్యాలయంలో సోమవారం ఆయన వెలుగు సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుర్రంకొండ మండల సమాఖ్య కార్యాలయంలో పనిచేసే సంఘమిత్రల్లో బినామీలున్నట్లు తెలిసిందన్నారు. ఈ బినామీలు అక్రమాలకు పాల్పడుతున్నట్లు జిల్లా అధికారులకు పలు ఫిర్యాదులు వచ్చాయన్నారు. అంతేకాకుండా గ్రూప్ సభ్యుల నుంచి రుణాలకు మామూళ్లు వసూలు చేస్తున్నారని కొందరు నాయకులు తమ దృష్టికి తెచ్చినట్లు తెలిపారు. మండలంలో బినామీ సంఘమిత్రలుగా పనిచేసే వారి వివరాలను తమకు పంపాలన్నారు.

అలాంటి వారిని తక్షణమే తొలగించడానికి తగిన చర్యలు తీసుకోవాలని ఏపీఎం రజనీకుమారిని ఆదేశించారు. అనంతరం మండలంలో గ్రూప్‌ల వివరాలు, సభ్యులకు అందుతున్న రుణాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. సంఘమిత్రలు విధులను దుర్వినియోగం చేస్తే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సీసీలు, సంఘమిత్రలు పాల్గొన్నారు.

వాహనం ఢీకొని కృష్ణజింక మృతి



ములకలచెరువు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ములకలచెరువులో సోమవారం ఓ కృష్ణజింక దారి తప్పి వచ్చి హల్‌చల్ చేసింది. జనావాసంలోకి వచ్చి దిక్కుతోచక హడలెత్తిపోయింది. చివరకు గుర్తుతెలియని వాహనం ఢీకొని మృతి చెందింది. స్థానికుల కథనం మేరకు...ములకలచెరువు బస్టాండు సర్కిల్ సమీపంలో ముంబాయి-చెన్నై జాతీయ రహదారిపైకి ఓ కృష్ణజింక వచ్చింది. రోడ్డు పక్కనున్న రైల్వే క్వార్టర్స్ నుంచి వచ్చిన జింక అడ్డుగా ఉన్న రైల్వే కమ్మీలు దాటుకుని రోడ్డుపైకి వచ్చింది. కొంతసేపు రోడ్డుపై అటు, ఇటు తిరిగింది. జాతీయ రహదారికి ఇరువైపులా ఫుట్‌పాత్‌కు ఆనుకుని ఇటీవల వేసిన ఇనుప కమ్మీలు దాటుకోలేక రోడ్డుకు అడ్డుగా తిరిగింది. చివరకు దానిని గుర్తుతెలియని వాహనం ఢీకొంది. తీవ్రంగా గాయపడిన అది కొద్దిసేపటికి మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎస్ఐ గాయత్రి సంఘటనా స్థలానికి చేరుకుని విషయాన్ని ఫారెస్టు అధికారులకు సమాచారం ఇచ్చారు. ఫారెస్టు అధికారులు మృతి చెందిన జింక కళేబరాన్ని కనుగొండ అటవీప్రాంతంలో ఖననం చేశారు.

గుండాలకోనకు రోడ్డు మంజూరు

- తీరిన భక్తుల కోరిక
- రూ.2 కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం


గుండాలకోనకు వెళ్లే మార్గం

రైల్వేకోడూరు (రూరల్), డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గుండాలకోనకు రోడ్డు నిర్మించాలని ఎన్నో ఏళ్లుగా కోరుకుంటున్న భక్తుల కల నెరవేరింది. చిట్వేలి మండలంలోని పెద్దూరు నుంచి ఎండ్రకాయ గుండాలకోన రోడ్డుకు మోక్షం లభించింది. రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ.2 కోట్లు మంజూరు చేసింది. చాలా ఏళ్లుగా ముళ్లపొదలు, అధ్వాన్నమైన రోడ్డులో కోనకు వెళ్లాలంటే భక్తులు చాలా ఇబ్బందులు పడేవారు. ఇక్కడ మహిమాన్వితమైన ఎండ్రకాయ రూపంలో శివుడు దర్శనమిస్తాడు. కార్తీకమాస ఉత్సవాల్లో ప్రతిరోజూ వేలాది మంది భక్తులు ఇక్కడ పూజలు చేసి అక్కడ ఉన్న జలపాతంలో స్నానం ఆచరిస్తారు. మహాశివరాత్రి రోజు భక్తులు ఇక్కడికి పోటెత్తుతారు. గత ప్రభుత్వంలో రోడ్డును మంజూరు చేసినా నిధులు విడుదల చేయకపోడంతో పాటు అటవీశాఖ అధికారుల అనుమతులు కూడా మంజూరు కాకపోవడంతో రోడ్డు పనులు కార్యరూపం దాల్చలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ రోడ్డుకు నిధులతో పాటు అటవీశాఖ అనుమతులు కూడా ఇచ్చింది. దీంతో గుండాలకోన రోడ్డుకు ఉన్న అడ్డంకులు పూర్తిగా తొలగిపోయి త్వరలో రోడ్డు పనులు ప్రారంభం కానున్నాయి. ఎన్నో ఏళ్లుగా ఆధ్యాత్మికంగా విరాజిల్లుతున్న గుండాలకోనకు రోడ్డు వస్తుండటంతో భక్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

తండ్రి చేతిలో కొడుకు హతం


హుస్సేన్‌బాష (ఫైల్‌ఫోటో)

దువ్వూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండలం కానగూడూరు గ్రామంలో సోమవారం హత్య జరిగింది. కన్న తండ్రే కొడుకును హత్య చేశాడు. మైదుకూరు సీఐ శివశంకర్ వివరాల మేరకు... హుస్సేన్‌బాషా (23) మద్యానికి బానిసై కుటుంబ సభ్యులను దూషించేవాడు. కొద్దిరోజుల కిందట డబ్బులు ఇవ్వలేదని హుస్సేన్‌బాషా తన తండ్రి మహబూబ్ షరీఫ్‌ను చంపుతానని బెదిరించాడు. ప్రతిరోజు లాగానే సోమవారం మద్యం సేవించి ఇంటి వద్దకు వచ్చి తండ్రితో గొడవ పడ్డాడు. భయానికి గురైన మహబూబ్‌షరీఫ్ రోకలిబడెతో కొడుకు తలపై బలంగా కొట్టాడు. తీవ్రగాయాలపాలైన క్షతగాత్రుడిని చాగలమర్రి ఆస్పత్రికి తరలించగా అక్కడ మృతిచెందాడని సీఐ తెలిపారు.

న్యాయం చేయండి: తన భర్త మృతికి కారణమైన మహబూబ్‌షరీఫ్‌పై తగిన చర్యలు తీసుకోవాలని మృతుని భార్య పోలీసులను వేడుకున్నారు. తనకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

డీసీసీ బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలి

- రాష్ట్ర అసోసియేషన్ కార్యనిర్వాహక అధ్యక్షుడు



ర్యాలీగా వెళ్తున్న అసోసియేషన్ నాయకులు, ఉద్యోగులు

కడప రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) సేవలను ఖాతాదారులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యనిర్వహక అధ్యక్షుడు గంటా సూర్యనారాయణరెడ్డి పేర్కొన్నారు. డీసీసీబీ సేవలపై సోమవారం అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉద్యోగులు కడప నగరంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు ఎంప్లాయీస్ అసోసియేషన్ పిలుపు మేరకు డిసెంబరు 2 నుంచి 8వ తేది వరకు వారం రోజుల పాటు డీసీసీ బ్యాంకు అందిస్తున్న సేవలను ప్రజలకు వివరించేందుకు పలు కార్యక్రమాలను చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం కడప నగరంలో విస్తృత ప్రచారం సాగించి డిపాజిట్ల సేకరణను తలపెట్టామన్నారు. డీసీసీ బ్యాంకు ఖాతాదారులకు మరింతగా సేవలను అందించేందుకు వడివడిగా ముందుకు సాగుతోందన్నారు. సహకార సంవృద్ధి డిపాజిట్ కాలపరిమితి కింద 666 రోజులకు సీనియర్ సిటిజన్లకు అన్ని బ్యాంకుల కంటే 8.35 శాతం అత్యధిక వడ్డీని, అలాగే సాధారణ ప్రజలకు 7.85 శాతం వడ్డీ ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎన్.సుధీర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి ఎల్.రాజేంద్రప్రసాద్‌రెడ్డి, వీరబ్రహ్మం, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడల్లో గురుకుల విద్యార్థులకు గోల్డ్‌మెడల్


గెలుపొందిన విద్యార్థులతో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

లింగాల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో మండలంలోని ఇప్పట్ల గురుకుల కళాశాల విద్యార్థులు గెలుపొంది గోల్డ్‌మెడల్ సాధించారు. నవంబరు 29, 30, ఈనెల 1వ తేదీలలో పశ్చిమగోదావరి జిల్లా పెదవేగి గురుకుల కళాశాలలో రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో తమ కళాశాల నుంచి చెస్‌కు ఒకరు, క్యారమ్స్‌కు ఇద్దరు, డిస్క్‌త్రోకు ఒకరు, రన్నింగ్‌కు ఒకరు ప్రాతినిధ్యం వహించారని ప్రిన్సిపల్ సత్యవతమ్మ తెలిపారు. సీనియర్ ఎంపీసీ ఎ.నిర్మల డిస్క్‌త్రోలో మొదటిస్థానం, 7వ తరగతి చదువుతున్న వి.భవ్య 200 మీటర్ల విభాగంలో మొదటిస్థానంలో నిలిచారని పేర్కొన్నారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సెక్రటరీ ప్రసన్న వెంకటేష్ విద్యార్థులకు గోల్డ్‌మెడల్ బహూకరించారు. రాష్ట్రస్థాయిలో గెలుపొందిన విద్యార్థులకు సోమవారం ఇప్పట్ల గురుకుల కళాశాలలో ప్రిన్సిపల్ సత్యవతమ్మ, ఉపాధ్యాయులు, సహ విద్యార్థులు అభినందనల వర్షం కురిపించారు. విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచేందుకు ఉపాధ్యాయులు సునీత, మాధవిలు ఎంతో శ్రమించారని ప్రిన్సిపల్ వెల్లడించారు.

విద్యార్థులకు సౌకర్యాల కల్పన


- వైస్‌చాన్సలర్ క్రిష్ణారెడ్డి

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వైవీయూ అనుబంధ వసతిగృహాల విద్యార్థులకు అన్ని సౌకర్యాలు సమకూరేలా నిర్ణయాలు తీసుకున్నారు. వైస్‌చాన్సలర్ క్రిష్ణారెడ్డి, రిజిస్ట్రారు పద్మ, వసతిగృహాల చీఫ్ వార్డెన్, ప్రిన్సిపల్ రఘునాథరెడ్డి వార్డెన్లతో సోమవారం సమీక్ష నిర్వహించారు. విద్యార్థుల అవసరాలు గుర్తించి ప్రిన్సిపల్ రఘునాథరెడ్డి ఈసీ దృష్టికి తెచ్చారు. అనంతరం వైస్‌ఛాన్సలర్ మాట్లాడుతూ విద్యార్థినిలకు ప్రత్యేక మెస్ ఏర్పాటు, సోలార్ విద్యుత్ సౌకర్యం కల్పించాలన్నారు. విద్యార్థులకు వేడి నీరు అందించే ఏర్పాటు చేస్తున్నామన్నారు. అవసరమైనంత సిబ్బందిని ఏర్పాటు చేసి బాధ్యతలు ఇవ్వనున్నట్లు స్పష్టం చేశారు. అలాగే క్యాంపస్‌లో సీసీ కెమెరాలు పనిచేయని చోట వెంటనే ఏర్పాటు చేయాలని, ఇన్వర్టర్లు అవసరం ఉంటే ఏర్పాటు చేయాలన్నారు.

అంతర్ విశ్వవిద్యాలయాల పోటీల్లో కాంస్యపతకం

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): అంతర్ విశ్వవిద్యాలయాల పోటీల్లో వైవీయూ విద్యార్థి దేవరకొండ ప్రేమ్‌సాగర్‌కు కాంస్యపతకం దక్కింది. 51 కిలోల విభాగంలో ఈ పతకం సాధించాడు. ఈ విద్యార్థి కమలాపురం సీఎస్ఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్నాడు. దక్షిణభారత అంతర్ విశ్వవిద్యాలయ పోటీల్లో పాల్గొని పతకం సాధించడం పట్ల వైస్‌ఛాన్సలర్ క్రిష్ణారెడ్డి, రిజిస్ట్రారు పద్మ, ప్రిన్సిపల్ రఘునాథరెడ్డి, క్రీడల శాఖ విభాగం రామసుబ్బారెడ్డి అభినందనలు తెలిపారు.

నేషనల్ ఆర్ట్ గ్యాలరీకి ఏఎఫ్ఏయూ విద్యార్థి చిత్రం



కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ యూనివర్సిటీ పెయింటింగ్ విభాగం విద్యార్థి ఎస్.కార్తీక్‌కు అరుదైన అవకాశం దక్కింది. జాతీయ స్థాయిలో ప్రఖ్యాత జహంగీర్ ఆర్ట్ గ్యాలరీలో నిర్వహించే ఎగ్జిబిషన్‌లో ప్రదర్శనకు ఉంచే టాప్ 45 చిత్రాల్లో కార్తీక్ గీసిన చిత్రానికి అవకాశం లభించింది. నవంబరు 24 నుంచి 30 వరకు క్యామల్ ఆర్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హంపీలో నిర్వహించిన వర్క్‌షాపులో ఉత్తమమైన కళాఖండాలను ఎంపిక చేయగా అందులో కార్తీక్ గీసిన చిత్రం ఉంది. దీనిని ఈ నెల 14 నుంచి 20 వరకు ముంబైలో జహంగీర్ ఆర్ట్ గ్యాలరీ ఎగ్జిబిషన్‌లో ఉంచనున్నారు. తమ విద్యార్థి చిత్రం నేషనల్ ఆర్ట్ గ్యాలరీలో ప్రదర్శనకు ఎంపిక కావడంతో వీసీ విశ్వనాథకుమార్ అభినందనలు తెలిపారు.

కాసుల పంట.. కురిసెను రైతు ఇంట



- నిలకడగా టమోటా ధరలు
- ఆశించిన రీతిలో దిగుబడులు
- ఆనందోత్సాహాల్లో రైతులు

సంబేపల్లె, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): రాయలసీమ జిల్లాల్లో కరువు నేలపై కాసులు కురిపించే పంట ఏదైనా ఉందంటే అది టమోటా. అన్నమయ్య జిల్లాలో కొన్ని మండలాల్లో రైతులు టమోటా సాగు విపరీతంగా సాగు చేస్తారు. ఇందులో సంబేపల్లె, చిన్నమండెం, కలకడ, గుర్రంకొండ, అంగళ్లు, మదనపల్లె, కేవీపల్లె, మొలకలచెరువు, తంబళ్లపల్లి మండలాల్లో రైతులు విపరీతంగా టమోటా పంటసాగులు చేపడతారు. ఈ ఏడాది టమోటా రైతులకు ధరలు కలిసొచ్చాయి. ఐదారు నెలలుగా ధరలు నిలకడగా ఉండడంతో రైతులకు ఆశించిన రీతిలో కాసులు కురిపించాయి. కరువు నేలపై కాసుల పంట కురిసింది. రైతులు ఆశించిన రీతిలో మంచి దిగుబడులు రావడంతో మంచి ఆదాయాలను అర్జించారు.


సాగులో ఉన్న టమోటా తోట

టమోటా సాగులో నూతన ఒరవడి

ఒకప్పుడు టమోటా సాగుకు, ప్రస్తుత టమోటా సాగుకు ఎంతో వ్యత్యాసం ఉంది. పంట సాగుల్లో రైతులు నూతన ఒరవడిని సృష్టిస్తున్నారు. ఇందులో భాగంగా అధిక దిగుబడినిచ్చే తీగజాతి రకాలు మార్కెట్‌లో రావడంతో వాటివైపు మొగ్గు చూపుతున్నారు. సాధారణ టమోటా సాగు (కట్టెలు కట్టకుండా) నాలుగు నుంచి ఆరు టన్నుల దిగుబడి వస్తే, తీగజాతి రకం టమోటా 20 నుంచి 22 టన్నులు దిగుబడి రావడం విశేషం. రైతులు కట్టె పద్ధతిలో పురి కట్టి సాగు చేయడంతో వర్షాలకు టమోటా తోటలు దెబ్బతినకుండా కాయ నాణ్యతగా మంచి దిగుబడి తీస్తున్నారు.

సాగుకు పెరిగిన ఖర్చులు

తీగజాతి రకం టమోటా సాగుకు పెట్టుబడులు పెరిగిపోయాయి. గత నాలుగు సంవత్సరాల క్రితం ఒక ఎకరానికి 80 నుంచి రూ.లక్ష పెట్టుబడి పెట్టేవారు. ప్రస్తుతం 1.50 లక్షల నుంచి 1.70 లక్షల వరకు పెట్టుబడి వస్తోంది. కూలీలు రేటు పెంచారు. టమోటా సామగ్రి ధరలు పెరిగాయి. ఇలా ప్రతి ఒక్కటి పెరగడంతో సాగు ఖర్చులు పెరిగిపోయాయి.

రైతులకు అనువుగా మార్కెట్‌లు

రైతులకు అనుకూలంగా టమోటా మార్కెట్లు ఏర్పాటు చేశారు. జిల్లాలో కలకడ, గుర్రంకొండ, మొలకలచెరువు, మదనపల్లి, అంగళ్లు ప్రాంతంలో టమోటా మార్కెట్లు ఉన్నాయి. దీంతో రైతులు పండించిన టమోటా మార్కెట్‌కు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. చిత్తూరు ఆర్కాడు, చెన్నై, ఆళ్లగడ్డ, హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి వ్యాపారులు తోటల వద్ద టమోటా కొనుగోలు చేస్తున్నారు.

మంచి ఆదాయం వచ్చింది

- నాగిరెడ్డి, రైతు, మాధంవాండ్లపల్లి

ఈ సారి టమోటా సాగులో మంచి ఆదాయం వచ్చింది. ఒకటిన్నర ఎకరం టమోటా సాగు చేశా. పెట్టుబడి సుమారు రూ.3.50 లక్షలు వచ్చింది. ఖర్చులు పోనూ దాదాపు రూ.4 లక్షల వరకు ఆదాయం వచ్చింది. ఈ సారి టమోటా నష్టాల నుంచి గట్టెక్కింది.

ధర ఉంటే.. ఆదాయం లక్షల్లోనే

- వెంకటేశ్వరనాయుడు, దిగువరాజుగారిపల్లె, దేవపట్ల



టమోటా ధరలు ఉంటే ఆదాయం లక్షల్లోనే ఉంటుంది. ఒక ఏడాది ధరలు అమాంతంగా పడిపోవడం, పెట్టుబడులు రాక నష్టపోవడం జరుగుతుంది. ఈ ఏడాది నిలకడగా ధరలు ఉండడంతో మంచి ఆదాయం వచ్చింది. సంబేపల్లె వద్ద గుత్తకు రెండు ఎకరాల పొలం తీసుకొని సాగు చేశా. ఖర్చులు పోనూ 9 లక్షలు ఆదాయం వచ్చింది.

అక్రమాలపై మొదలైన విచారణ

- పలు సెక్షన్లలో ఫైళ్లు పరిశీలిస్తున్న అధికారులు


మున్సిపల్ ఆర్‌డీ విశ్వనాథ్

ప్రొద్దుటూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో గత ఐదేళ్ల వైసీపీ పాలనలో సాగిన అక్రమాలపై మున్సిపల్ రీజనల్ డైరెక్టర్ విశ్వనాథం సారథ్యంలో విచారణ మొదలైంది. సోమవారం ఉదయం ప్రొద్దుటూరుకు వచ్చిన ఆర్‌డీ మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ మల్లికార్జునతో కలిసి సమావేశమయ్యారు. అనంతరం విచారణ బృందంలోని ఎస్ఈ రామ్మోహన్‌రెడ్డి, ఈఈ షాకీర్, డీఈ సత్యనారాయణ, ఏఈ శరత్‌చంద్రలకు ఇంజనీరింగ్ సెక్షన్‌లోని ఫైళ్లు పరిశీలించమని ఆదేశించారు. దీంతో వారు ఇంజనీరింగ్ సెక్షన్ అధికారులైన ఈఈ చెన్నకేశవరెడ్డి, డీఈలు దస్తగిరి, ప్రభాకర్‌దాస్, యశోద, ఏఈలు మణిగోపాల్‌రెడ్డి, సురేంద్ర, దిల్షాద్‌లతో కలిసి ఇంజనీరింగ్ సెక్షన్‌లో గత ఐదేళ్ల కాలంలో జరిగిన వర్కులకు సంబంధించిన ఫైళ్లను సంవత్సరాల వారిగా విభజించారు. అలాగే గ్రాంట్ వర్కులు, జనరల్‌ఫండ్ వర్కులు, ఇతర వర్కులను పరిశీలించారు. అలాగే బర్త్ అండ్ డెత్ విభాగంలోనూ పరిశీలించారు. టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించి బుధవారం టౌన్‌ప్లానింగ్ ఆర్‌డీ రానున్నారని, ఆయన వచ్చాక బిల్డింగ్ అనుమతుల ఫైళ్లు, ఇతర ఫైళ్లు పరిశీలించనున్నట్లు ఆర్‌డీ తెలిపారు. ప్రస్తుతం టౌన్ ప్లానింగ్ సెక్షన్‌కు సంబంధించి అన్ని ఫైళ్లు అందుబాటులో వుంచుకోవాలని ఆ సెక్షన్ అధికారులను, సిబ్బందిని ఆదేశించినట్లు తెలిపారు.

కీలక ఫైళ్ల మాయంపై విచారణ

టౌన్‌ప్లానింగ్ సెక్షన్‌లో కీలక ఫైళ్ల మాయంపై గతంలో ఇక్కడ పనిచేసి కడప కార్పొరేషన్‌కు బదిలీపై వెళ్లిన ఏసీపీ మునిరత్నం సోమవారం మున్సిపల్ కార్యాలయానికి వచ్చారు. మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున ఎదుట హాజరై ఫైళ్లకు సంబంధించిన సమాచారంపై వివరణ ఇచ్చారు. అయితే ఆ ఫైళ్లకు సంబంధించిన పూర్తి స్థాయి సమాచారం అందించలేదని చెబుతున్నారు. అలాగే టౌన్‌ప్లానింగ్ సెక్షన్‌లో పాత ఫైళ్లకు సంబంధించి ఆన్‌లైన్ చేసిన హార్డ్‌డిస్క్ గురించి కూడా ఏసీపీ మునిరత్నం సరైన సమాధానం చెప్పనట్లు సమాచారం. దీనిపై కమిషనర్ మల్లికార్జునను వివరణ కోరగా ఆయన ఫోన్‌లో అందుబాటులోకి రాలేదు.

ఆటోను ఢీకొన్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు

- ఇద్దరు మృతి
- నలుగురికి గాయాలు


మృతి చెందిన సుబ్బయ్య, రోశయ్య

పోరుమామిళ్ల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాల్వకట్ట వద్ద ఆటోను ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఢీకొనడంతో ఇద్దరు మృతిచెందగా, మరో నలుగురికి గాయాలయ్యాయి. వివరాలిలా.. ఆర్వీ ట్రావెల్స్‌కు చెందిన బస్సు హైదరాబాదు నుంచి పోరుమామిళ్లకు వస్తుండగా, బెస్తవారిపేట నుంచి బద్వేలుకు ప్యాసింజరు ఆటో వస్తోంది. కాల్వకట్ట వద్దకు రాగానే బస్సు ఆటోను ఢీకొనడంతో రామేశ్వరం గ్రామానికి చెందిన బి.రోశయ్య (65), అక్కులరెడ్డిపల్లెకు చెందిన ఎం.సుబ్బయ్య (60) అనే వారు అక్కడికక్కడే మృతి చెందారు. బెస్తవారిపేటకు చెందిన కంచి వెంకటకుమార్, అలినగరం గ్రామానికి చెందిన కొమరం చెన్నమ్మ, గిద్దలూరుకు చెందిన బాలుడు అలియాస్ బాలచంద్రుడు, కొమరోలు మండలం పామూరుకు చెందిన షేక్ నాగుర్‌వల్లికి తీవ్రగాయాలయ్యాయి. ప్రమాదకర సంఘటన తెలిసిన వెంటనే సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ కొండారెడ్డి సంఘటనా స్థలానికి వెళ్లి ప్రమాదానికి గల విషయాలు ఆరా తీశారు. గాయపడ్డ వారిని 108 వాహనం ద్వారా పోరుమామిళ్లకు తరలించారు. గాయపడ్డ వారిలో చెన్నమ్మ, మరో వ్యక్తిని ప్రొద్దుటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు ప్రైవేటు బస్సు డ్రైవరుపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

- మరికొందరికి గాయాలు


మృతిచెందిన మహిళ

జమ్మలమడుగు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మండలంలోని ప్రొద్దుటూరు రోడ్డులో అలీపాలకోవా సెంటర్ సమీపాన సోమవారం సాయంత్రం ఆటో డివైడర్‌కు తగిలి ఆటో వెనుక కూర్చొని ఉన్న డక్కా వెంకటభార్గవి (30) అనే మహిళ ఘటనా స్థలంలోనే దుర్మరణం చెందింది. పోలీసుల వివరాల మేరకు.. జమ్మలమడుగు పట్టణంలోని బీసీ కాలనీకి చెందిన మూడు కుటుంబాల వారు మొత్తం 15 మంది దాకా ఆటోలో గండి క్షేత్రానికి సాయంత్రం బయల్దేరారు. ప్యాసింజర్ అప్పీ ఆటోలో జమ్మలమడుగు నుంచి ప్రొద్దుటూరు రోడ్డుకు వెళుతుండగా పక్కనే వెళుతున్న లారీని ఓవర్‌టేక్ చేయబోయి ఆటో డ్రైవర్ వెంకటయ్య డివైడర్‌కు ఢీకొన్నాడు. దీంతో వెనుక కూర్చొని ఉన్న మహిళ మృతి చెందగా అందులో ప్రయాణం చేస్తున్న పిల్లలు, పెద్దలు కలిపి 14 మందికి స్వల్పగాయాలయ్యాయి. వెంకట్ అనే బాలుడికి మోకాలుకు గాయమైంది. ఘటన జరిగిన వెంటనే ఎస్ఐ కల్పన, రైటర్ సుబ్బారెడ్డి, వారి సిబ్బంది ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతిచెందిన మహిళను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వాహనం ఢీకొని ఒకరు..


బాలక్రిష్ణ (ఫైల్‌ఫోటో)

దువ్వూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మైదుకూరు మండలం మిట్టమాను సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. ఎదురుగా వస్తున్న వాహనం ఢీకొని బాలకృష్ణ (25) అనే యువకుడు మృతిచెందాడు. మృతుడు తన స్నేహితుడితో కలిసి బ్రహ్మంగారిమఠం నుంచి మైదుకూరుకు బైకులో వస్తుండగా మార్గమధ్యంలో ఈ సంఘటన జరిగింది. కాగా ఈ ప్రమాదంలో మృతుడి స్నేహితుడు శ్రీను గాయపడ్డాడు.

జేసీ వర్గీయులు వస్తారేమోనని.. మళ్లీ పోలీసుల మోహరింపు

కొండాపురం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి మధ్య ఆర్టీపీపీకి చెందిన ఫ్లైయాష్ రవాణాలో వివాదం ఇంకా సద్దుమణకపోవడంతో మళ్లీ పోలీసులు అలర్ట్ అయ్యారు. ఆర్టీపీపీ వద్ద జేసీ వర్గీయులకు సంబంధించిన వాహనాలకు ఎమ్మెల్యే ఆది వర్గీయులు బూడిదను లోడ్ చేయనివ్వకపోవడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. తాడిపత్రి నుంచి జేసీ ప్రభాకర్‌రెడ్డి కానీ, అతని అనుచరులు కానీ ఇటువైపు వస్తారేమోనని, సోమవారం ఉదయం 6 నుంచే జిల్లా సరిహద్దుల్లో ఉన్న సుగుమంచిపల్లె చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు మోహరించారు. ఇద్దరు సీఐలు, ఎస్ఐలు, సుమారు 30 మంది పోలీసులు మోహరించారు. శాంతిభద్రతలకు విఘాతం తలెత్తే అవకాశం ఉండటంతో అనుమానం వచ్చిన వాహనాలను తనిఖీలు నిర్వహించారు. జమ్మలమడుగు డీఎస్పీ వెంకటేశ్వరరావు చెక్‌పోస్ట్ వద్దకు వచ్చి పరిస్థితిని సమీక్షించారు. సిబ్బందికి తగు జాగ్రత్తలు, సూచనలు చేశారు. కాగా ఈ ప్రాంతంలో 144 సెక్షన్‌ను విధించినట్లు కొండాపురం సీఐ మహమ్మద్ రఫీ తెలిపారు.

'మత్తు పదార్థాలకు బానిసవ్వద్దు'

సీకేదిన్నె, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): యువత మత్తుపదార్థాలకు బానిస కాకూడదని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, జయరాజ్‌లు తెలిపారు. స్థానిక కేఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాలలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం విద్యార్థినీ, విద్యార్థులకు మాదక ద్రవ్యాలు, వాటి వినియోగం వలన కలిగే అనర్థాలు గురించి సోమవారం అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాదకద్రవ్యాలకు అలవాటు పడితే జీవితాలు నాశనమవుతాయని, తల్లిదండ్రుల ఆశయాలు నెరవేర్చకపోగా మంచి జీవితాన్ని కోల్పోతారన్నారు. మానసికంగా, శారీరకంగా అనేక రుగ్మతలకు గురవుతారని వివరించారు. ఇంజనీరింగ్ విద్య ఎంతో ఉన్నతమైన లక్ష్యంతో పూర్తి చేసి జీవితంలో స్థిరపడాలని, చెడు వ్యసనాలకు బానిస కాకుండా చెడు స్నేహాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు రవికుమార్, క్రిష్ణకుమార్, కళాశాల ఎండీ కందుల చంద్రఓబుళరెడ్డి, ప్రిన్సిపల్ వీఎస్ఎస్ మూర్తి, వైస్‌ప్రిన్సిపల్ ప్రసాద్ విద్యార్థులు పాల్గొన్నారు.

5న టేబుల్ టెన్నిస్ పోటీలు

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వైవీయూ అంతర్ కళాశాలల టేబుల్ టెన్నిస్ పోటీలు ఈ నెల 5న నిర్వహించనున్నట్లు వైవీయూ క్రీడా బోర్డు కార్యదర్శి కె.రామసుబ్బారెడ్డి ప్రకటనలో తెలిపారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు 2024 జూలై 7 నాటికి 17 సంవత్సరాలు నిండి 25 సంవత్సరాల్లోపు ఉండాలన్నారు. వైవీయూ అనుబంధ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు. క్రీడాకారులు పదోతరగతి, ఇంటర్మీడియట్ ఒరిజినల్ స్టడీ సర్టిఫికెట్లు మిగతా అన్ని స్టడీ సర్టిఫికెట్ల జిరాక్స్‌లతో హాజరుకావాలని సూచించారు.

వైవీయూ డిగ్రీ పరీక్షలు వాయిదా

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వైవీయూ పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాలల విద్యార్థులకు సోమవారం జరగాల్సిన సెమిస్టరు పరీక్షలు రద్దు చేసినట్లు వైవీయూ పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసరు క్రిష్ణారావు తెలిపారు. వైస్‌ఛాన్సలరు క్రిష్ణారెడ్డి ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామని, తదుపరి తేదీని తెలియజేస్తామన్నారు.

నీటి నిల్వలు ఎప్పటికప్పుడు పరిశీలించాలి

సుండుపల్లె, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): నీటి నిల్వలు ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉండాలని ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకట రామయ్య, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చంగలరాయుడు తెలిపారు. సోమవారం మండలంలోని యర్రపురెడ్డి ఆదినారాయణ రెడ్డి పింఛా ప్రాజెక్టును వారు పరి శీలించారు. పింఛా ప్రాజెక్టుకు నీరు చేరుతుండడంతో రాత్రి పూట ఎప్పటికప్పుడు నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తూ ఉండాలన్నారు. వరద ఉధృతి అధికంగా ఉన్నపుడు కాలువల ద్వారా నీరు విడుదల చేయాలని సూచించారు. పై ప్రాంతాల నుంచి 1630 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టులోకి చేరుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఈ నాగేంద్ర నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

తుఫాన్ బాధితుడికి ఆర్థిక సాయం

ఓబులవారిపల్లె, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాను కారణంగా పెంకుటిల్లు కూలిపోవడంతో ఇబ్బందులు పడుతున్న దివ్యాంగుడి కుటుంబాన్ని ముక్కా రూపానందరెడ్డి ఫౌండేషన్ ఆదుకుంది. మండలంలోని చిన్నఓరంపాడు పంచాయతీ అయ్యలరాజుపల్లె హరిజనవాడకు చెందిన దాసరి సుబ్రమణ్యం ఇల్లు కూలిపోయిన విషయం సామాజిక మాధ్యమాల ద్వారా తెలుసుకున్న ముక్కా వరలక్ష్మి సోమవారం రూ.15 వేలు నగదు, దుప్పట్లు పంపిణీ చేశారు. గ్రామంలోని దాసరి సుబ్బమ్మ, దాసరి లక్ష్మీసుజాత నివసించే పెంకుటిల్లు పైకప్పు కూలి ప్రమాదకరంగా ఉందని తెలియడంతో, పంచా యతీ సిబ్బంది ఎంపీడీవో మల్‌రెడ్డి, తహసీల్దారుతో కలసి వారి గృహాలు పరిశీలించారు. రేషన్‌కార్డుల మంజూరు, కుటుంబ సభ్యుల నమోదు, ఇళ్ల మంజూరుకు గ్రామ సచివాలయాల్లో నమోదు చేసుకోవాలని ఎంపీడీవో మల్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ రామ్మోహన్‌రెడ్డి, టీడీపీ నాయకులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

● మదనపల్లె డివిజన్‌లో 836 హెక్టార్లలో నేలవాలిన పంట
● రైతులకు అదనపు ఖర్చులు
● ప్రత్యామ్నాయంపై వ్యవసాయాధికారుల సూచనలు

వర్షాలతో దెబ్బతిన్న వరి

మదనపల్లె టౌన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మదనపల్లె డివిజన్‌లో గత మూడు రోజులుగా కురుస్తున్న జడివానలతో పెద్దమొత్తంలో వరిపంట నేలవాలి దెబ్బతినింది. రబీ సీజన్‌కు ముందే డివిజన్‌లోని ఎనిమిది మండలాల్లో రైతులు వరి పంట సాగు చేయగా ప్రస్తుతం వరి కోతదశలో ఉంది. ఈ క్రమంలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో నేలవాలిన వరిపంటను కాపాడుకునేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మదనపల్లె వ్యవసాయ డివిజన్‌లో ఎనిమిది మండలాలు ఉండగా వాటిలో మదనపల్లె, నిమ్మనపల్లె, కురబలకోట, రామసముద్రం, బి.కొత్తకోట మండలాల్లో ఎక్కువగా రైతులు వరిపంట సాగు చేశారు. ఇందులో మదనపల్లె మండలంలో 324 హెక్టార్లు, నిమ్మనపల్లెలో 265, కురబలకోటలో 65, రామసముద్రంలో 32, బి.కొత్తకోట మండలంలో 150 హెక్టార్లలో కలిపి మొత్తం 836 హెక్టార్లు(2,090 ఎకరాలు) వరిపంట వర్షాలతో నేలవాలిపోయింది. దీంతో పాటు 20 హెక్టార్లలో మొక్కజొన్న పంట కూడా పడిపోయింది. ఆరుగాలం కష్టపడి రైతులు సాగు చేసిన వరి ప్రస్తుతం వెన్నుదశలో ఉండగా మొక్కజొన్న మొలకలు ఎత్తే స్థితిలో ఉంది. ఈ క్రమంలో వరుస వర్షాలతో పంటను కాపాడుకోవడంలో రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. కాగా సోమవారం మదనపల్లె ఏడీఏ శివశంకర్ మదనపల్లె మండలంలోని కొత్తపల్లె, బొమ్మనచెరువు, నందిరెడ్డిగారిపల్లె గ్రామాల్లో దెబ్బతిన్న వరిపంటను పరిశీలించి, రైతులకు పలు సూచనలు అందజేశారు.

తుఫాన్ కారణంగా ఆగిన వరి కోతలు

పెద్దమండ్యం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి) తుఫాన్ కారణంగా మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వరి కోతలు పూర్తిగా ఆగిపోయాయి. నోటి కొచ్చిన పంటలు చేజారుతున్నా యని పెద్దమండ్యం మండల వరి రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. యంత్రాలతో వరి కోతలు పూరైన చోట ధాన్యం దెబ్బతిని తీవ్ర నష్టం కలిగించాయని వాపోతున్నారు. వర్షంలోనే వరి కోతలకు వెళ్లిన యంత్రాలు కొన్ని చోట్ల అక్కడే బురదలో ఇరుక్కుపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోపక్క టమోటా పంట కూడా ఈ తుఫాన్ తాకిడికి దెబ్బతినడంతో రైతుతు ఢీలా పడ్డారు. వరి కోతలు జరిపిన రైతులు ధాన్యం ఆరబోసి తగిన జాగ్రత్తలు పాటించాలని ఏవో సురేష్‌బాబు వెల్లడించారు. కాగా ఈ తుఫాన్ వర్షాల ధాటికి పెద్దమండ్యం సమీపం లోని పలు చెరువులు, కుంటలు నిండిపొర్లుతు న్నాయి. ఎగువ అడవి ప్రాంతంలో నుంచి ఎక్కు వగా నీటి ప్రవాహం రావడంతో కుషావతినది ప్రవాహం పెరిగి పెద్దమండ్యంలోని పాతచెరువు మొరవ పోతోంది. తుఫాన్ ఆగిన తర్వాత వరి పంట పరిస్థితులు వెల్లడిస్తామని అధికారులు తెలిపారు.

ములకలచెరువులో: తంబళ్లపల్లె నియోజకవర్గంలోని వరి రైతులను ఫెంగల్ తుఫాను ముంచింది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పలు చోట్ల వరి పంట నీట మునిగింది. అలాగే పలు చోట్ల నేలకొరిగింది. పరిస్థితి ఇలాగే కొనసాగితే వరి రైతులకు మరింతగా తీవ్ర నష్టం వాటిల్లుతుంది. తంబళ్లపల్లె నియోజకవర్గంలో సుమారు 300 ఎకరాల్లో వరిపంట సాగులో ఉంది. పంట చేతికొచ్చే సమయంలో ఫెంగల్ తుఫానుతో రెండు రోజులుగా ఏకధాటిగా వర్షం కురుస్తూనే ఉంది. మంగళవారం కూడా వర్షం కొనసాగితే వరి చేతికందే పరిస్థితులు ఉండవని రైతులు చెబుతున్నారు.

నిమ్మనపల్లెలో నేల వాలిన పెద్ద వృక్షాలు

నిమ్మనపల్లె, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాన్ ధాటికి మూడు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షానికి పంటలతో పాటు పెద్ద వృక్షాలు నేలకు ఒరిగాయి. సోమవారం ఏవో మురళిమోహన్ తుఫాన్ కారణంగా దెబ్బతిన్న వరి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మండలంలోని పది పంచాయతిలలోనూ నీట మునిగిన 285హెకార్లులో వరి పంటను పరిశీలించి నివేదికను ఉన్నతాధికారులకు పంపనున్నట్లు తెలిపారు. కాగా తుఫాన్ ధాటికి వెంకోజిగారిపల్లి గ్రామంలో ఓ భారీ చింత చెట్టు నేలవాలింది. ఆ సమయంలో రెడ్డిబాబు అనే వ్యక్తి చిన్న పాటి గాయాలతో బయట పడ్డాడు. తుఫాన్ కారణంగా కురుస్తున్న వర్షంతో గృహాలు ఉరుస్తున్నాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.


మదనపల్లెలో వర్షాలతో నేలవాలిన వరిపంటను రైతులతో కలసి పరిశీలిస్తున్న ఏడీఏ శివశంకర్


ములకలచెరువు మండలం వేపూరికోట సమీపంలో నేలకొరిగిన వరిపంట


పెద్దమండ్యం మండలం కుంటకింద గొల్లపల్లి ప్రాంతంలో ఆగిన వరి కోతలు

పిట్ట కొంచెం..కూత ఘనం...
సాంస్కృతిక కళానాట్యంలో దిట్ట స్నేహలత

మదనపల్లె అర్బన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణానికి చెందిన అడ్వకేట్ సోముశేఖర్, అరుణ దంపతులు కుమార్తె చిన్నారి స్నేహలత, కూచిపుడి నాట్యం లో తన సత్తాను చాటింది. సరిగ్గా పదేళ్ల వయస్సు కలిగిన చిన్నారి హైదరాబాదులోని రవీంద్రభారతీలో ఇటీవల తాను కూచిపుడి నృత్య ప్రదర్శన ప్రదర్శించి పలువురిని ఆకట్టుకుంది. మదనపల్లెలో 7వ తరగతి చదువుతున్న చిన్నారి స్నేహలత వివిధ ప్రాంతాల్లో తన నాట్య ప్రదర్శన చేసి సత్తాను చాటుకొంటూ ఎన్నో పథకాలను స్వంతం చేసుకుంది. రాష్ట్ర స్థాయిలో తెలంగాణ రాష్ట్రం హైదరాబాదులో నిర్వహించిన పోటీలో తన సత్తాచాటి తృతీయ స్థానంలో నిలిచింది. అలాగే మదనపల్లెలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన పోటీలో నెగ్గి అప్పటి ఎమ్మెల్యే నవాజ్‌బాషా చేతులమీదుగా ప్రశంసలు పొందింది. తిరుపతిలోని మహతి ఆడిటోరియంలో నిర్వహించిన భారత్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సంక్రాంత్రి సంబరాలులో కూచిపుడి నాట్యం చేసి స్వర్ణనంది పురస్కారంలో భాగంగా ప్రశంసలు అందుకొంది. ఈ చిన్నారి ఇంకా ఉన్నత అవార్డులు పొందాలని గురువులు, తల్లిదండ్రులు ఆకాంక్షిస్తున్నారు.


కూచిపూడి నాట్యం చేస్తున్న స్నేహలత


రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్‌లో కప్పు అందుకొన్న చిన్నారి

జగన్ పాలనలో పాపాలు..రాష్ట్రానికి నేడు శాపాలు

● రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేశ్

మదనపల్లె టౌన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో జగన్ తీసుకున్న నిర్ణయాలు, చేసిన పాపాలు నేడు రాష్ట్రానికి శాపాలుగా మారాయని రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేశ్ ధ్వజమెత్తారు. సోమవారం స్థానిక విలేకర్లతో ఆయన మాట్లాడుతూ సీఎంగా ఉన్నప్పుడు జగన్ ఆడ్డగోలు ఒప్పందాలతోనే నేడు రాష్ట్ర ప్రజలపై విద్యుత్‌భారం పడుతోందన్నారు. ఇవేమి పట్టనట్లు జగన్ మీడియా ద్వారా పదేపదే విషప్రచారం చేయిస్తున్నారని ఆరోపించారు. వైసీపీ పాలనలో విద్యుత్ ఒక యూనిట్ ధర రూ.1.90 దొరుకుంతుంటే, జగన్ ఆనాడు అదాని గ్రూపుతో ఒక యూనిట్ విద్యుత్‌ను రూ.2.49కి కొనుగోలు చేసేలా 25 ఏళ్ల ఒప్పందం కుదుర్చుకున్నాడని దీంతో నేడు ప్రజలపై విద్యుత్ భారం పడుతోందన్నారు. ఇప్పటికైనా జగన్, అతని మీడియా కూటమి నాయకులపై చేసే అసత్య ప్రచారాలు మానుకోవాలని హితవు పలికారు.

టీడీపీ సభ్యత్వాల నమోదు వేగవంతం చేయాలి

కలికిరి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పీలేరు నియోజకవర్గంలో టీడీపీ సభ్యత్వాల నమోదును మరింత వేగవంతం చేయాలని ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి పార్టీ శ్రేణలను ఆదేశించారు. సోమవారం నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో నమోదు చేస్తున్న పార్టీ సభ్యత్వాలపై ఆయన సోమవారం నాయకులతో సమీక్ష నిర్వహించారు. పీలేరు మండలంలో 9862, వాల్మీకిపురంలో 7897, కలకడలో 7683, కలికిరిలో 6357, గుర్రంకొండలో 4595, కేవీ పల్లెలో 4230 వంతున సభ్యత్వాలు పూర్తయినట్లు ఆయన వివరించారు. గతంలో 2018లో పీలేరు నియోజకవర్గం రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. కనీసం 70 వేల సభ్యత్వాలను నమోదు చేసేందుకు పార్టీ శ్రేణులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. క్రియాశీల సభ్యుల భవిష్యత్ కోసం నారా లోకేశ్ నిరంతరం ఆలోచిస్తున్నారని అందులో భాగంగానే రూ.వంద సభ్యత్వం చెల్లిస్తే రూ.ఐదు లక్షల బీమా సౌకర్యాన్ని అమల్లోకి తెచ్చారని చెప్పారు. వాట్సాప్, టెలిగ్రామ్, టీడీపీ వెబ్‌సైట్ల ద్వారా కార్యకర్తలు నేరుగా సభ్యత్వాన్ని నమోదు చేసుకోవచ్చని సూచించారు. మరో వారం రోజుల్లో 70 వేల సభ్యత్వాలకు చేరుకోవాలని చెప్పారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి ఎన్‌ఆర్‌ఎల్‌ఎం కీలకం

తంబళ్లపల్లె, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): డ్వాక్రా సంఘాల్లోని మహిళా సభ్యుల ఆర్థికాభివృద్ధికి ఎన్‌ఆర్‌ఎల్‌ఎం(నేషనల్ రూరల్ లైవ్‌లీవుడ్ మిషన్) ద్వారా పూర్తి స్థాయిలో ఆర్థిక సహాయం అందచేయడం జరుగుతుందని ఎన్‌ఆర్‌ఎల్‌ఎం-ఎన్ ఆర్పీ నీలెందు ముఖర్జి తెలిపారు. సోమవారం స్థానిక స్త్రీ శక్తి భవనంలో సెర్ప్ ఆధ్వర్యంలో ఎస్‌వీఈపీ, డీపీఆర్ నివేదికల తయారీపై ఆరు మండలాల ఏపీయంలు, సీసీలు, సీఆర్పీలు, ఈసీ మెంబర్లకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్‌వీఈపీ ద్వారా మహిళల ఆర్థిక స్థితిగతులు, వారు చేయాలనుకున్న చిన్న చిన్న వ్యాపారాలు, చేతి వృత్తులు, కుల వృత్తులపై సర్వే నిర్వహించి నివేదిక సిద్ధం చేయాలని ఈ నివేదికల పరిశీలన అనంతరం డీపీఆర్ నివేదికలను రూపొందించి కేంద్ర ప్రభుత్వానికి పంపడం జరుగుతుందన్నారు. డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ మాట్లాడుతూ.. ఎన్‌ఆర్‌ఎల్‌ఎం సర్వే పారదర్శకంగా నిర్వహించి భవిష్యత్‌లో మహిళల ఆర్థికాభివృద్ధికి సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో సెర్ప్ ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు శేఖర్, డీపీఎంఎల్‌హెచ్ గంగార్జున, ఏపీయం గంగాధర్, స్త్రీ నిధి మేనేజరు అమరావతి, ఆరు మండలాల ఏపీయంలు, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు రామలక్ష్మీ, సీసీలు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ తదితరులు

రోడ్డు పొరంబోకు స్థలంలో అక్రమ నిర్మాణాల తొలగింపు

మదనపల్లె టౌన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం కొండామరిపల్లె రెవిన్యూగ్రామంలో రోడ్డు పొరంబోకు స్థలంలో నిర్మించిన అక్రమ నిర్మాణాలను రెవెన్యూ అధికారులు తొలగించారు. స్థానిక సీటీఎం రోడ్డులోని దేవతానగర్ వద్ద సర్వేనెంబర్ 1050లో రోడ్డు పొరంబోకు స్థలం ఉంది. ఈ క్రమంలో కొందరు ఈ స్థలాన్ని ఆక్రమించుకుని నిర్మాణాలు చేపట్టారు. ఇందులో శ్రీరాములు అనే వ్యక్తి మదనపల్లె సబ్‌కలెక్టర్‌కు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదుల చేయడంతో సబ్ కలెక్టర్ ఆదేశాల మేరకు మదనపల్లె రెవెన్యూ అధికారులు రోడ్డు పొరంబోకు స్థలంలో నిర్మాణాలపై సర్వే అధికారులు నిర్ధారించడంతో వీఆర్‌వో ప్రసాద్ ఆధ్వర్యంలో ఎక్స్‌కవేటర్ తీసుకెళ్లి అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు.


అక్రమ నిర్మాణాలను కూల్చివేయించిన రెవెన్యూ అధికారులు

సర్వేయర్లకు బయోమెట్రిక్ హాజరు మినహాయించాలి

పీలేరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయిలో పనిచేసే తమకు బయోమెట్రిక్ హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలని పీలేరు మండలంలోని గ్రామ సర్వేయర్లు విజ్ఞప్తి చేశారు. రీ-సర్వే గ్రామసభల్లో వచ్చిన దరఖాస్తుల పరిష్కారంతో పాటు రీసర్వే రాళ్ల మీద పేర్ల తొలగింపు కార్యక్రమంలో పాల్గొంటున్న తమకు గ్రామ సచివాలయాల్లో బయోమెట్రిక్ హాజరు వేసేందుకు వీలుపడడం లేదని వారు తెలిపారు. ప్రతిరోజూ బయోమెట్రిక్‌లో ఇన్ అండ్ ఔట్ హాజరు వేస్తేనే జీతాల బిల్లులు పెడతామని పంచాయతీ కార్యదర్శులు చెబుతున్నారని ఆ రెండు పనులు పూర్తయ్యే వరకు తమకు బయోమెట్రిక్ హాజరు మినహాయింపు ఇవ్వాలని వారు కోరారు. ఈ మేరకు సోమవారం వారు పీలేరు తహసీల్దారు భీమేశ్వరరావుకు వినతి పత్రం అందజేశారు. ఈ విషయంపై తహసీల్దారు మాట్లాడుతూ ఉన్నతాధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటామన్నారు.


తహసీల్దారుకు వినతి పత్రం అందజేస్తున్న సర్వేయర్లు

8న ఆన్‌లైన్‌లో క్రీడాజ్ఞాన్ పరీక్ష

మదనపల్లె అర్బన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్‌లో ఈనెల 8న నిర్వహించే క్రీడాజ్ఞాన్ పరీక్షను సద్వినియోగం చేసుకోవాలని మదనపల్లె మండల విద్యాశాఖాధికారులు ప్రభాకర్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు 8న ఉదయం 5 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు క్రీడాజ్ఞాన్ పరీక్షను ఆన్‌లైన్‌లో రాయాలని తెలిపారు. 12 ఏళ్ల పైబడిన బాల,బాలికలు ఎవ్వరైనా ఇందులో పాల్గొనవచ్చని తెలిపారు. ఇందులో ప్రథమ బహుమతి లక్ష, ద్వితీయ బహుమతి ఇద్దరికి రూ. 50 వేలు, మరో ఇద్దరికి తృతీయ బహుమతి కింద రూ. 25 వేలు చొప్పున, నాలుగో అవార్డు 6మందికి రూ.11వేలు ఒక రీజియన్‌లో 11మందికి ప్రధానం చేస్తారన్నారు. మరెన్నీ వివరాలకు ఈ కింది ఫోన్‌నెంబర్లకు 6281881022, 9885055402కు సంప్రదించాలని కోరారు.

తుఫాన్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి


కదిరమ్మ చెరువును పరిశీలిస్తున్న తహసీల్దారు ఖాజాబీ

మదనపల్లె అర్బన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా కురుస్తున్న వర్షాల పట్ల అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మదనపల్లె తహసీల్దారు ఖాజాబీ సూచించారు. సోమవారం చీకలబైలు పంచాయతీలోని కదిరమ్మచెరువు, వెంకటమ్మచెరువు, మేడిపల్లె చెరువులను పరిశీలించారు. చెరువు మరవలు, కట్టల పటిష్టతను తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. తుఫాను వర్షాలకు కాలువల ద్వారా చెరువుల్లోకి వస్తున్న నీటి ఉధృతి వివరాలను తెలుసుకున్నారు. ఇరిగేషన్ అధికారులు ఎప్పటికప్పుడు చెరువులను పర్యవేక్షిస్తూ వివరాలను ఉన్నతాధికారులకు అందచేయాలని సూచించారు. తహసీల్దారు వెంట ఆర్ఐ శేషాద్రిరావు, వీఆర్వోలు, సిబ్బంది ఉన్నారు.

నేడు ఉపాధి హామీ సామాజిక తనిఖీ బహిరంగ సభ

ములకలచెరువు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): స్థానిక సీఎల్‌ఆర్‌సీ కార్యాలయంలో మంగళవారం గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సంబంధించి బహిరంగ సభ జరగనుంది. మండలంలో 2023 ఏప్రిల్ 1వతేదీ నుంచి ఈ ఏడాది మార్చి 1వతేదీ వరకు జరిగిన ఉపాధి పనులకు సంబంధించి సామాజిక తనిఖీ బృందాలు పది రోజుల పాటు క్షేత్ర స్థాయిలో పరిశీలించి కూలీలతో నేరుగా మాట్లాడారు. సామాజిక తనిఖీలో బయటపడ్డ విషయాలను బహిరంగ సభలో వెల్లడించనున్నారు.

14న అరుణాచలంకు ఆర్టీసీ బస్సులు

మదనపల్లె అర్బన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మదనపల్లె వన్ డిపో నుంచి అరుణాచలం గిరిప్రదక్షిణ కోసం ఈ నెల 14న ఆర్టీసీ బస్సులు నడుపుతున్నట్లు ఆ డిపో డీఎం పేర్కొన్నారు. ప్రతి పౌర్ణమికి మదనపల్లె నుంచి తిరువణ్ణామలైకు ప్రయాణికులకు బస్సులు అందుబాలులో ఉంటాయని చెప్పారు. ఈ నెలలో 14న ఉదయం 9 గంటలకు బస్టాండ్‌లో ఆర్టీసీ బస్సులు బయలుదేరుతాయన్నారు. రాను పోను ఒకరికి టికెట్ ధర రూ.805 నిర్ణయించినట్లు తెలిపారు. మరెన్నీ వివరాలకు ఫోన్‌నెంబర్లకు 7382875034, 7382876638 సంప్రదించాలన్నారు.

రేపు తిరుపతిలో ఎంఆర్‌పీఎస్ సమీక్ష సమావేశం

పీలేరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లా ఎంఆర్‌పీఎస్ సమీక్ష సమావేశాన్ని ఈ నెల 4వ తేదీన తిరుపతిలో నిర్వహించనున్నట్లు ఎంఎస్‌పీ పీలేరు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ గండికోట వెంకటేశ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న సమీక్ష సమావేశాల్లో భాగంగా తిరుపతిలోని బాబు జగ్జీవన్‌రామ్ సమావేశ మందిరంలో సమావేశం ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. పీలేరు నియోజవర్గంలోని ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు అధిక సంఖ్యలో హాజరై సమీక్ష సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఆల్గేన్ మెన్‌వోజిటెక్నాలజీతో మిట్స్ ఒప్పందం


మెన్‌వోజిటెక్నాలజీతో ఎంవోయూ కుదుర్చుకుంటున్న కళాశాల వైస్ ప్రిన్సిపాల్

కురబలకోట, డిసెంబరు 2: మండలంలోని అంగళ్ళు సమీపంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యం తమిళనాడులోని తిరుచ్చికి చెందిన ఆల్గేన్ మెన్‌వోజిటెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్ తో ఎంవోయూ ఒప్పందం కుదుర్చుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ యువరాజ్ పేర్కొన్నారు. సోమవారం కళాశాలలో ఏఐ విభాగం ఆధ్వర్యంలో వైస్ ప్రిన్సిపాల్ రామనాథమ్ ఆ కంపెనీ వ్యవస్థాపకుడు సురేష్ కన్నయన్‌తో ఆ సంస్థ డైరెక్టర్ చిత్రాలు ఒప్పందం కుదుర్చుకున్నారు. దీని ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్యతో, ఇంటర్న్‌షిప్‌లు, ప్లేస్‌మెంట్, అందించడంతో పాటుగా అవగాహన కార్యక్రమాలలో సహాయసహకారాలు అందివ్వనున్నట్లు పేర్కొన్నారు. కళాశాల విద్యార్థులు ఉమ్మడి మార్గదర్శకత్వంలో ప్రాజెక్ట్‌లు, పరిశోధనలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. దీని ద్వారా విద్యార్థులకు మరింతగా ఉద్యోగవకాశాలు దక్కనున్నట్లు పేర్కొన్నారు.

ఎన్నికల హామీలను వెంటనే అమలు చేయాలి



మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ

మదనపల్లె అర్బన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంగళవారం నిర్వహించే రాష్ట్రమంత్రివర్గ సమావేశంలో అంగన్వాడీ, ఆశా, మున్సిపల్, భవన నిర్మాణ కార్మికుల, ఆటో వర్కర్స్‌కు ఇచ్చిన హామీలపై చర్చించాలని కోరారు. ఈ నెల 12న అంగన్వాడీలు ఐక్యంగా జిల్లా కలెక్టర్ కార్యాలయాల ఎదుట ఆందోళనలకు సిద్ధం అయ్యారని తెలిపారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ వర్కర్స్‌ను రెగులర్ చేసి సమానపనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు దేవా, తిరుమల, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు వెంకటరమణ, ఇక్బాల్, చందాబాషా, తదితరులు పాల్గొన్నారు.

కాలుష్య నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత

వాల్మీకిపురం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): వాతావరణ కాలుష్యాన్ని నివారించడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని అన్నమయ్య జిల్లా జనవిజ్ఞాన వేదిక అధ్యక్షుడు ప్రభుచరణ్ పేర్కొన్నారు. సోమవారం వాల్మీకిపురం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్, తదితరప్రాంతాలలో కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్య జీవితంలో వ్యవసాయం, పరిశ్రమలలో రసాయనాల వినియోగం విచ్చలవిడిగా సాగుతుండడంతో కాలుష్య భూతం పెరిగిపోయి తద్వారా మానవ జీవితాలకు ముప్పు ఏర్పడుతోందన్నారు. మొక్కలు నాటడం, వాటిని సంరక్షించుకోవడంతో పాటు రసాయన రహిత వ్యవసాయం చేయడం, రసాయనాల వినియోగాన్ని తగ్గించడం ద్వారా కాలుష్యాన్ని నివారించవచ్చన్నారు. సంస్థ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

నేడు అంగన్‌వాడీలకు ఒక రోజు శిక్షణ

పెద్దతిప్పసముద్రం డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు ఉల్లాస్ యాప్ కార్యక్రమంపై ఒక రోజు శిక్షణ ఇస్తున్నట్లు ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్ తెలిపారు. ఈ కార్యక్రమానికి మండంలోని అంగన్‌వాడీ కార్యకర్తలు హాజరుకావాలన్నారు. మండలంలో వయోజన విద్య ద్వారా విద్యను అందించేందుకు అంగన్‌వాడీలకు శిక్షణ ఇస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఉర్దూ పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే

మదనపల్లె అర్బన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి):స్థానిక ఇందిరానగర్‌లోని ఉర్దూ పాఠశాలను సోమవారం ఎమ్మెల్యే షాజహాన్‌బాషా సందర్శించారు. ఇటీవల నాలుగు రోజుల నుంచి ఎడతురపి లేకుండా కురుస్తున్న వర్షం కారణంగా ఇందిరానగర్‌లోని పాఠశాల లోపలికి వర్షం నీరు వచ్చి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నట్లు స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే స్పందించిన ఆయన మున్సిపల్ కమిషనర్ ప్రమీల, మున్సిపల్ అధికారులతో వెళ్లి పాఠశాలను పరిశీలించారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు.

జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో కొత్తకోర్సులు

మదనపల్లె టౌన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మదనపల్లెలోని జీఎంఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో వెబ్ డెవలపర్ కోర్సులు ప్రవేశ పెడుతున్నట్లు ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కో ఆర్డినేటర్ నవీన్ తెలిపారు. ఈ కోర్సులో నాలుగు నెలల పాటు ఉచిత నైపుణ్య శిక్షణ ఇస్తామన్నారు. ఇంటర్ పైన చదివిన విద్యార్థులు వెబ్ డెవలపర్ కోర్సులో చేరవచ్చన్నారు. పూర్తి వివరాలకు 95532 02509 నెంబర్‌కు ఫోన్ చేసి సంప్రదించాలని కోరారు.

అకాల వర్షానికి టమోటా పంటకు తీవ్ర నష్టం

బి.కొత్తకోట, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట మండలంలో గత మూడు రోజులుగా తుఫాన్ ధాటికి ఎడతెరిపి లేని వర్షంతో టమోటా పంటకు తీవ్రనష్టం వాటిల్లింది. కాయలురాలిపోయి, ఉన్నకాయలకు గజ్జి, ఆకులకు నల్లమచ్చ లాంటి రోగాలతో రైతులు చెప్పుకోలేని బాధను అనుభవిస్తున్నారు. కాగా మండలంలోని గోళ్లపల్లె, తుమ్మణంగుట్ట, బడికాయలపల్లె, కోటావూరు, బి.కొత్తకోట తదితర గ్రామాలలో వరి, మొక్కజొన్న పంట సుమారు 40 ఎకరాలలో దెబ్బతిన్నట్లు తహశీల్దార్ మహమ్మద్ అన్సారీ పేర్కొంటున్నారు. దీనిపై పంచాయతీల వారీగా బాధిత రైతుల వివరాలతో పాటు ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామన్నారు. ఆయా గ్రామాలలో వీఆర్‌వోలు క్షేత్రస్థాయిలో పరిశీలించి పంటనష్టాన్ని అంచనా వేస్తారన్నారు. తుఫాను పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతే రెవెన్యూ అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

కరాటే పోటీల్లో పీలేరు విద్యార్థుల ప్రతిభ



పీలేరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా రేణిగుంటలో ఆదివారం జరిగిన అంతర్ జిల్లాల చాంపియన్‌షిప్ పోటీల్లో పీలేరు విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. అండర్-14 విభాగంలో ముదిత్ సాయి ప్రథమ స్థానం, ఫరూఖ్ తృతీయ స్థానం, అండర్-11 విభాగంలో కన్విక ద్వితీయ స్థానం, అండర్-15 విభాగంలో హితేష్ ద్వితీయ స్థానం, ఫైట్ విభాగంలో వికాస్ ద్వితీయ స్థానం, ఓపెన్ కేటగిరీలో తృతీయ స్థానం సాధించినట్లు యోధా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ మాస్టర్ ఇనాముల్ హక్ తెలిపారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు


మంజుల (ఫైల్‌ఫొటో)

మదనపల్లె అర్బన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి):మహిళ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు తాలుకా సీఐ కళావెంకటరమణ తెలిపారు. మదనపల్లె మండలం, ఎనుమలవారిపల్లెకు చెందిన నిమ్మనపల్లె నరసింహులు కుమార్తె ఎస్.మంజుల(49) కూలీ పనులు చేసుకొంటూ జీవనం సాగిస్తుంది. ఆమె నవంబరు 28 తేదీ రాత్రి ఇంటి నుంచి వెళ్లిపోయిందని కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వెతికినా కనపడలేదన్నారు. తమ్ముడు నిమ్మనపల్లె ప్రశాంత్‌కుమార్ ఫిర్యాదు మేరకు ఆదివారం రాత్రి మంజుల అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు తాలుకా సీఐ తెలిపారు.

గీతా జయంతి ఉత్సవాలు ప్రారంభం

వాల్మీకిపురం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): టీటీడీ, హిందూ ధర్మ ప్రచార పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం వాల్మీకిపురం పట్టాభిరామాలయంలో గీతా జయంతి మహోత్సవాలను వైభవంగా ప్రారంభించారు. సాయంత్రం 6.30 గంటల నుంచి బ్రహ్మశ్రీ సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు గీత పారాయణాన్ని భక్తిశ్రద్ధలతో భక్తులకు వివరించారు. ఆలయ ప్రాంగణంలో 18రోజులుగా ప్రతి రోజూ సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8గంటల వరకు 18 అధ్యయనాలు పారాయణం, ప్రవచనాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహిళా సంఘం సభ్యులు, యువజన సంఘం సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప స్వామి పడిపూజ

మదనపల్లె అర్బన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి):మండలంలోని నక్కలదిన్నె సత్సంగ్ స్కూల్ వద్ద మహేష్‌స్వామి ఆధ్వర్యంలో సోమవారం అయ్యప్ప స్వామి అంబలం పడిపూజ వైభవంగా నిర్వహించారు. పడిపూజలో విశేసంగా పూలతో అలంకరణ చేసి అభిషేకాలు, పూజలు చేశారు. అయ్యప్ప మాలదారులు ప్రత్యేకంగా భజనలు నిర్వహించారు. పడిమెట్లు శోభాయానంగా అలంకరణ చేశారు. . అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

శివాలయంలో అభిషేక పూజలు

పెద్దతిప్పసముద్రం డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన పీటీఎంలో వెలసిన ప్రసన్న పార్వతీ సమేత విరూపాక్షేశ్వర స్వామి ఆలయంలో సోమవారం స్వామివారికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. పీటీఎంకు చెందిన ఆధ్యాత్మిక వేత్త సనగరం పట్టాభిరామయ్య ఆధ్వర్యంలో ఆలయలంలో ఉదయం శివుడికి పంచామృతాభిషేకం, ఏకవార రుద్రాభిషేకం అత్యంత వైభవంగా నిర్వహించారు. అనంతరం స్వామి వారికి పంచహారతి, సప్తహారతి, నక్షత్రహారతితో పాటు మహామంగళ హారతి కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలతో పాటుగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

వాహనం ఢీకొని యువకుడికి తీవ్ర గాయాలు

కురబలకోట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడికి తీవ్ర గాయాలైన సంఘటన సోమవారం మండలంలో జరిగింది. మండలంలోని అంగళ్ళు సమీపంలోని జరిగిన సంఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. వాల్మీకిపురం మండలం బూడిదవేడుకు చెందిన ఎల్లయ్య(40) ఎక్స్‌కవేటర్ డ్రైవర్‌గా పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కాగా ఆయన విధులకు మధ్యాహ్నం ద్విచక్రవాహనంలో భోజనానికి వెళుతుండగా కొత్త బైపాస్ రోడ్డు సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ప్రమాదంలో గాయపడ్డ అతడిని మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ముదివేడు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారించారు. ఈ మేరకు ముదివేడు ఎస్ఐ దిలీప్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.